
Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

Hotel D.S.R Paradise

Function Hall
- Fully Airconditioned
- 250 seating capacity
- L.E.D lighting - Ample car parking
అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
Longest Living Newspaper in Telugu Journalism
# జిల్లాలైమ
సంపుటి: 82 • సంచిక: 7 • 17-2-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-


a *** hotel with 5 star comforts
D.R. UTTHAMA HOTEL
Winner of Excellence Award 2004, 2005 & 2006
G.T.Road, Nellore - 524 003.(A.P)
Ph: 0861 - 2317777
email - drutthama@yahoo.co.in

# విఆర్ కాలేజి ఆస్తి స్వాహాకు పెద్ద పన్నాగం!

- కొత్త ఇంజనీరింగ్ కాలేజి కోసం విఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో ఆనం బ్రదర్స్ దరఖాస్తు చేశారు.
- వందేళ్లకు పైబడి ఈ విద్యాసంస్థలు విఆర్ కాలేజి అండ్ హైస్కూల్ కమిటీ సొసైటీ పేరుతో రిజిష్టర్ అయివున్నాయి.
- కొత్త సొసైటీలో ఆనం కుటుంబీకులే సభ్యులు.
- వైఎంసిఎ గ్రౌండ్‌లో నాలుగున్నర ఎకరాల విస్తీర్ణంలో వున్న విఆర్ విద్యాసంస్థల ఆస్తి విలువ ఎంత తక్కువనుకొన్నా 250కోట్ల రూపాయల పై మాటే.


ఈ భవనాన్ని ఆనం బ్రదర్స్ తమ స్వంత ఇంజనీరింగ్ కాలేజి కోసమే ముస్తాబు చేస్తున్నారు.

విఆర్ కాలేజి తరపున ఒక ఇంజనీరింగ్ కాలేజి స్థాపించడానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కేంద్రానికి దరఖాస్తు సమర్పించారు. మొన్న 13తేది హైదరాబాదులో జరిగిన స్క్రూటినీ సమావేశంలో ఈ దరఖాస్తు పరిశీలనకు వచ్చింది. నూరేళ్లకుపైగా చరిత్ర కల్గిన ఈ విద్యాసంస్థ దాదాపుగా మూతపడే స్థితికి చేరుకొందన్న ఆందోళన అటు నగర ప్రజలలో, ఇటు పూర్వ విద్యార్థులలో అలజడి రేపుతున్న సమయంలో కొత్త ఇంజనీరింగ్ కాలేజి స్థాపనకు నిర్వాహకులు ముందుకు రావడం సంతోషించదగిన పరిణామం. కేవలం మహిళల కోసం ఉద్దేశించిన ఇంజనీరింగ్ కాలేజి ఇది. నెల్లూరు నగరంలో ఒక మహిళా ఇంజనీరింగ్ కాలేజి అవసరం ఎంతగానో వుంది. నగర పరిసరాలలో ఆరేడు ఇంజనీరింగ్ కాలేజీలు వున్నప్పటికీ, అవేవీ మహిళలకు ప్రత్యేకించినవి కావు. విఆర్ కాలేజీ పుణ్యమా అని ఆ కొరత తీరడంతో పాటు, నగర నడిబొడ్డున నెలకొంటున్నది కాబట్టి, చదువుకొనే ఆడపిల్లలకు ఎంతో సౌకర్యంగా కూడా వుంటుంది. బస్సులెక్కి దూరాభారం వెళ్లే ప్రయాస తప్పుతుంది.

వైఎంసిఎ గ్రౌండ్స్ మైదానంలో ఈ కొత్త కాలేజి స్థాపనకు దరఖాస్తు చేశారు. అక్కడ ఇప్పటికే ఒక విశాలమైన భవనం నిర్మితమై వుంది. దాదాపు నాలుగున్నర ఎకరాల భూమి అందుబాటులో వుంది. ఎఐసిటిఇ నియమాల ప్రకారం ఒక ఎకరా భూమికి 300 మంది విద్యార్థుల లెక్కన చేర్చుకొనేందుకు అనుమతిస్తారు. నాలుగున్నర ఎకరాల భూమి వుంది కాబట్టి, దాదాపు 1500 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవచ్చు.

అన్నీ బాగానే వున్నాయి కానీ, ఈ సంస్థ

కొరవ 14వ పేజీలో



# సారాజుల భోజ్యం

త్రాగితే స్వర్గం అగుపడతదని చెప్పాడు సినిమా కవి. త్రాగిస్తే ఖజానా పొంగి పొర్లుతుందని నిరూపించింది మహా ఘనత వహించిన రాష్ట్ర సర్కారు. త్రాగించే వాడికి చేయూత ఇస్తే ఇంట్లో కాసుల వర్షం కురుస్తుందని రుజువు చేస్తున్నారు రాజకీయవాదులు, అధికారులు. నెల రోజుల నుంచి రాష్ట్ర రాజకీయం సమస్తం సారా గబ్బు కొడుతున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పత్రికా విలేకరులు, ఎక్సైజ్ అధికారులు, పోలీసు దొరలు, చివరాఖరుకు కమ్యూనిస్టు కామ్రేడ్లు కూడా సారా లంచాల అమేధ్యాన్ని తలా కొంచెం తిలా పాపం వలె పంచుక తిన్నారని ఎసిబి నివేదికలు కోడై కూస్తున్నాయి.

మద్యం వ్యాపారం అనాదిగా గలీజు వ్యవహారమే. దాన్ని చట్టబద్ధం చేయడానికి కొత్త చట్టాలు చేస్తూనే వుంటాయి ప్రభుత్వాలు. ఆ చట్టాలను చుట్టుబండలు చేయడానికి కొంగ్రొత్త మార్గాలు వెతుకుతూనే వుంటారు మద్యం వ్యాపారులు. ఈ చట్టక్రీడలో గెలుపెప్పుడూ వ్యాపారులదే. ఆ వ్యాపార విజయ రహస్యం – చట్ట అతిక్రమణా నైపుణ్యం. ఆ ప్రావీణ్యులైన వారే అందులో నిలదొక్కుకొంటారు. అందులో అవినీతి వెతకడం – గొంగట్లో వెంట్రుకలను ఏరడంతో సమానం. కానీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఆ వ్యర్థ ప్రయత్నం ప్రారంభించాడు. అవినీతి నిరోధక శాఖను పురికొల్పాడు. ఆయన ఆంతర్యం మీద భిన్నాభిప్రాయాలున్నాయి. మద్యం వ్యాపారాన్ని క్షాళన చేయాలన్న చిత్తశుద్ధికంటే, రాజకీయంగా తనకున్న తలనొప్పులను అదుపు చేసుకోవడమే మనసులోని ఆలోచన అంటారు. నిజం దేముడికెరుక. కారణం ఏదైనా ఎసిబి తీగ లాగింది. దానితో డొంకంతా కదిలింది. అరడజనుకు పైగా మంత్రులు ఇరుక్కుపోయారు. ఎమ్మెల్యేలు, అధికారుల సంఖ్య కొండవీటి చాంతాడు వలె సాగుతూనే వుంది. మద్యం టోకు వ్యాపారాన్ని ప్రభుత్వపరం చేశాడు చంద్రబాబు. చిల్లర దుకాణాలకు వేలం పద్ధతి పాటింప చేశాడు. బ్రాందీ షాపుల మీద పోలీసు దాడులు నిలిపివేయించాడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి. అవి తెరిచి వుంచే వేళల మీద కూడా నియంత్రణ తగ్గించాడు. దానితో అంతా పారదర్శకంగా వుంటుందని, మాఫియా ముఠాల ప్రమేయం తొలగిపోతుందని భావించారు. కానీ ఆచరణలో అవినీతికి కొత్త దారులు పుట్టుకొచ్చాయి. వాటిలో ప్రధానమైనది గరిష్ట చిల్లర ధరలకు విక్రయం. వేలంలో పోటీలు పడి అంగళ్లు పాడుకొన్న వ్యాపారులు, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు బ్రాందీ, విస్కీలు అమ్మితే దివాలా తీసే పరిస్థితి కొని తెచ్చుకొన్నారు. ఆ ముప్పు తప్పాలంటే తమ ఇష్టం వచ్చిన ధరలకు అమ్మాలి. వీధికొక దుకాణం వుంది కాబట్టి సహజంగానే పోటీ వుంటుంది. మార్కెట్ సూత్రాల ప్రకారం పోటీ వుంటే ధరలు తగ్గించి అమ్మాలి. దాన్ని తప్పించుకోవడానికి అంగళ్ల యజమానులు సిండికేటు బృందాలుగా ఏర్పడ్డాయి. తమలో తాము ఒప్పందాలు చేసుకొని, అందరికీ ఒకే ధరగా అమ్మకాలు సాగించుకొంటున్నాయి. ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మడం చట్టాన్ని అతిక్రమించడం కాబట్టి, చట్టాన్ని అమలు చేయాల్సిన వారి కళ్లకు గంతలు కట్టాలి. అందుకు కరెన్సీ నోట్లు ఒక్కటే మార్గం. అదే పని చేశారు మద్యం వ్యాపారులు. ఈ ప్రక్రియ సమస్తం జగమెరిగిన సత్యం. ఇదంతా మామూలే అని అందరూ సర్దుకపోతూ వచ్చారింత కాలం. కానీ మద్యం సిండికేట్లపై ఎసిబి దాడులతో కందిరీగల తుట్టె కదిలింది. రాజకీయ చీకాకు నియంత్రించుకోవడానికి ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నం భస్మాసుర వరంగా మారింది. ఎసిబి నివేదికలు జనంలో చర్చకు వచ్చాయి. వాటి మీద చర్యలు తీసుకొంటే రాజకీయ సంక్షోభం తప్పేట్లు లేదు. ఈ దశలో వాటిని తొక్కి పెట్టజూస్తే జనం అసహ్యించుకొంటారు.

జమీన్‌రైతు

అరడజనుకు పైగా మంత్రులకు మద్యం సిండికేట్ల నుంచి ముడుపులు ముట్టాయని ఎసిబి నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఏ మాత్రం నీతి, రీతి వున్నా వారు పదవుల నుంచి తప్పుకోవాలి. లేదంటే ముఖ్యమంత్రి తొలగించాలి. అదే జరిగితే ప్రభుత్వం కుప్పకూలిపోతుంది. ఎక్సైజ్ శాఖలో ముప్పాతిక భాగం అధికారులు, సిబ్బందిని అయితే ఇళ్లకు లేకుంటే జైలుకు పంపాలి. పోలీసు శాఖ పరిస్థితీ అంతే. అదే జరిగితే ప్రభుత్వ యంత్రాంగం ఛిన్నాభిన్నం అవుతుంది. చర్య తీసుకొంటే సంక్షోభం, తీసుకోకుంటే అసభ్యం. ఈ చిక్కుముడిని ముఖ్యమంత్రి ఎట్లా విప్పుతాడో వేచి చూద్దాం.

ఇక్కడొక మాట – సమాజానికి నీతులు బోధించే పత్రికా రంగం కూడా ఈ బురద గుంటలో మునకలేస్తున్నదని రుజువైపోయింది. కానీ ఒక్క పత్రికా యాజమాన్యం కూడా దానిపై సరైన రీతిలో స్పందించిన సాదృశ్యం కన్పించడం లేదు. నీతులున్నది ఎదుటి వాడికి చెప్పడానికే అన్నది వారి సూత్రమా?

# జనవాక్కు

## నిరుద్యోగులకు అన్యాయం

ఇంటర్ లేకుండా డిగ్రీ, బియిడి పూర్తి చేసిన అభ్యర్థులు తాజా డిఎస్సీ – 2012లో ఎలాంటి పోస్టుకు అర్హులు కారని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.4ని జారీ చేయడం పూర్తిగా అనాలోచితం. ఇంటర్ ఉత్తీర్ణత తప్పనిసరి అన్న అర్థం లేని నిబంధన వల్ల ముఖ్యంగా తెలుగు, హిందీ భాషా పండితులు తీవ్రంగా నష్టపోయే అవకాశం వుంది. ఎడ్‌సెట్‌కు ముందు ఆ తర్వాత బిఇడి కౌన్సిలింగ్ సమయంలో అడగని ఇంటర్ ఉత్తీర్ణత తాజా డిఎస్సీకి నిబంధనగా విధించడం వల్ల దూరవిద్యలో డిగ్రీ చేసిన వేలాదిమంది నిరుద్యోగులు అన్యాయానికి గురయ్యే అవకాశం వుంది. కనీసం టెట్‌కు ముందు కూడా ప్రభుత్వం ఇంటర్ ఉత్తీర్ణత గూర్చి ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తాజా జీవో నెం.4ని వెంటనే రద్దు చేయాలి.

పబ్బిశెట్టి జయరామయ్య కావలి

## కఠినంగా అమలు చేయండి!

15 సంవత్సరాలు దాటిన వాహనాలకు పర్మిట్లు రద్దు చేసి వాటిని రోడ్డు మీద తిరిగేందుకు అనుమతించరాదన్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల సమర్థవంతంగా అమలుకు నోచుకోవడం లేదు. అనేక వాహనాలు శబ్ద, వాయు కాలుష్యాలను సృష్టిస్తూ పర్మిట్లు లేకపోయినా రోడ్లపై యదేచ్ఛగా తిరుగుతున్నాయి. నేడు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం ఫిట్‌నెస్‌లేని వాహనాల వల్లనే జరుగుతున్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. కనుక పర్యావరణం, రోడ్డు ప్రమాదాలను, ప్రజా సంక్షేమం దృష్టిలో వుంచుకొని ఈ నిబంధన కఠినతరంగా అమలు చేయాలని ప్రభుత్వానికి మనవి.

పి.అరుణకుమారి నెల్లూరు

## అంబేద్కర్ అందరివాడు!

భారత రాజ్యాంగ నిర్మాత, దళిత జాతుల వైతాళికుడు భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జ్ఞాపకార్థం నెలకొల్పబడిన విగ్రహాలను అమలాపురం, ధవళేశ్వరంలో కొందరు ధ్వంసం చేశారు. అంబేద్కర్ దళితుల అభ్యున్నతే కాదు సామాజిక సంస్కరణల దృష్టిలో భాగంగా స్త్రీల యొక్క హక్కుల కొరకు ముఖ్యంగా వారి విద్య కొరకు, కార్మిక సంక్షేమం కొరకు కొన్ని చట్టాలను అమలులోనికి తెచ్చాడు. అహోరాత్రులు శ్రమించి భారత రాజ్యాంగాన్ని వ్రాశారు. ఆయన రాజ్యాంగంలో వ్రాసిన ప్రాథమిక హక్కులు వాటి అమలు తీరు, న్యాయ వ్యవస్థకు ప్రసాదించబడిన స్వతంత్ర ప్రతిపత్తి వల్ల భారత ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తున్నది. అంబేద్కర్ విగ్రహాల విధ్వంసం దుశ్చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

రావూరి సురేంద్రనాథ్ నెల్లూరు

## 70 ఏళ్ల క్రితం ఈవారం

**20-2-1941**
**పేజీలు : 10 వెల: అణా**

### నెల్లూరు ముచ్చట్లు
### రంగడి గరుడసేవ

బిట్రగుంటలో 28వ తేది, నెల్లూరులో 1వ తేది గరుడసేవ.

### వావిళ్ల జబ్బు

వావిళ్ల వెంకటేశ్వర శాస్త్రిగారు పక్షవాతంతో జబ్బుగా ఉన్నారు. కొంచెం నెమ్మది. ఆంధ్ర వాగ్మయం ఉండే వరకు వావిళ్ల పేరు శాశ్వతం కదా! త్వరలో ఆరోగ్యవంతులగుదురు గాక.

### పరామర్శ

కె.ఎస్.కేసరి(కేసరి కుటీరాధిపతి) గారి ధర్మపత్ని చనిపోయెనన్న వార్త కఠోరం. కేసరి గారికి మా యొదార్పులు.

### కావలి విషయాలు

14వ తేది సాయంత్రం ప్రకాశం మంత్రి ఉపన్యసించాడు. యుద్ధ సాన్నిహిత్యాన్ని గూర్చి బోర్డులో తీర్మానాన్ని మార్చి నిర్మాణ కార్యక్రమాన్ని గూర్చి చక్కగా విపులీకరించారు.

జిల్లా బోర్డు వారి హయ్యరు ఎలిమెంటరీ పాఠశాల శిథిల భవన యాలం 16వ తేది సాగింది. హైదరాబాద్ నవాబ్‌ను ఐశ్వర్యంలో తలదన్నే కన్యకా పరమేశ్వరి రూ.200లకు తనకు కావాలన్నది. అంత తక్కువకు నేనివ్వనన్నాడు ప్రెసిడెంటు. యాలం నిల్చిపోయింది దేవీ! నీకు గూడా కోమటి పితకలాట మెందుకు? బోర్డుది గూడా ప్రజల డబ్బేగదా! తగ్గించి యివ్వమనడమేమి. న్యాయంగా అంత పెద్ద స్థలము, బిల్డింగు నాలుగు వేలన్నా చేయదా? బోర్డు గారు తక్కువకు అమ్మొద్దు సుమా!

## 50 ఏళ్ల క్రితం ఈవారం

**16-2-1962**
**పేజీలు: 12 వెల: 0-20 న.పై**

### ఏ.సి విజయాన్ని ఎవరూ ఆపలేరు

వ్యక్తిని బట్టి పోటీకి ప్రాధాన్యం వస్తుంటుంది. పార్లమెంటుకు కావలి ఎంత ముఖ్యమో; శాసనసభకు రాపూరు, సర్వేపల్లి అంత ప్రధానమైనవి. సర్వేపల్లి ఎప్పుడూ ప్రాధాన్యం వహిస్తూనే ఉన్నది. కానీ ఉన్నచోటు తెలియని రాపూరు ఈసారి రచ్చకెక్కింది.

ఏ.సి, రాపూరు నియోజకవర్గాన్ని ఎంచుకొని తొలిసారిగా ఆ నియోజకవర్గంలో పర్యటించిన నాటి అనుకూలత ఈనాడు లేదనేది వాస్తవం. కానీ ఆనాడు ఏ.సికి ప్రత్యర్థి ఎవరూ రంగంలో లేరనేది; ఇప్పుడు స్వతంత్ర పార్టీ అభ్యర్థియైన ప్రసాద్ ఆనాడు పోటీకి విముఖుడే గాక, ఏ.సికి సుముఖుడనేది గమనించినప్పుడు, ఆనాటి అనుకూలత ఈనాడు ఉండకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

పర్సనాలిటీ; వారు ఏనాడైనా మంత్రి అయ్యే అవకాశముండేవారని, వారి వల్ల తాలుకా అభివృద్ధి చెందగలదనే ఆశ ప్రజలలో ఉండడం; ముందు రంగంలో దిగడం ఇవి ఏ.సి.సుబ్బారెడ్డి గారికున్న అనుకూలాలు. అదీగాక ఎన్నిక యంత్రాంగం, అనుభవం వీరికి అదనపు అనుకూలాలు. స్థానికుడు కావడం, మైకారాజులు అండదండగా ఉండడం; కులబలం చెప్పుకోదగినంతగా ఉండడం; స్వతంత్ర పార్టీ పార్లమెంటు అభ్యర్థి ఈ తాలుకా వాడు కావడం, ఏ.సి వస్తే సంజీవయ్య పోతాడనే వ్యతిరేక ప్రచారం జరగడం, ఇవి ప్రసాద్‌కున్న అనుకూలాలు. ఎన్నికలలో అనుభవశూన్యత, ప్రయోజనకరమైన కృషిజేసే వర్కర్ల లోటు ప్రసాద్ అననుకూలాలు.

ఏ.సి ఈ మధ్య కొంత బయట తిరిగినా, ఇప్పుడు ఇచ్చట కేంద్రీకరిస్తున్నారు. దీనివల్ల తప్పక ప్రయోజనముంటుంది. అయితే మొదట ఆశించినంత మెజారిటీ రాదనే కొరత తప్ప ఏ పరిస్థితుల్లోనూ ఏ.సి సుబ్బారెడ్డి గారి విజయానికి సందేహం లేదు. వారి విజయాన్ని ఏ శక్తులూ అడ్డలేవు.

– మా పరిశీలకుడు

# నెల్లూరు ముచ్చట్లు

## సమ్మర్ స్టోరేజి ట్యాంకు పూర్తయ్యిందా? లేదా??

నగర ప్రజల దాహార్తి తీర్చను 120 కోట్ల రూపాయలు వెచ్చించి నెల్లూరు చెరువులో నిర్మించిన సమ్మర్ స్టోరేజి ట్యాంకు పనులు పూర్తయినట్లు, దాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య చేతులమీదుగా దీన్ని ప్రారంభించారు. వాస్తవానికి ఈ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. కానీ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిచేతనే ఉత్తుత్తి ప్రారంభోత్సవం జరిపించారు. ఈ వారంలో నెల్లూరు వచ్చిన పబ్లిక్ హెల్త్ విభాగం చీఫ్ ఇంజనీర్ పాండురంగారావు సమ్మర్ స్టోరేజి ట్యాంకు పనుల ప్రగతిని స్వయంగా వెళ్లి పరిశీలించారు. కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎన్నాళ్లకు ఈ ట్యాంకు నిర్మాణం పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులను అధ్వాన్నంగా చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోమని ఆదేశించారు. వాస్తవానికి ఈ పనిని ఎల్‌అండ్‌టి సంస్థ దక్కించుకొంది. స్థానిక రాజకీయం మూలంగా పని చేయలేక నేతలు చెప్పిన కాంట్రాక్టర్లకు ఇచ్చి చేతులు దులుపుకొంది. దీని మూలంగా ఈ పని వినాయకుడి పెళ్లిలా తయారయ్యింది.

## దిగేడుస్తున్న కొరియర్ సర్వీసులు!

నెల్లూరు నగరంలో కొరియర్ సర్వీసుల పనితీరు పోస్టల్ శాఖ కంటే అధ్వాన్నంగా మారింది. ఒకప్పుడు హైదరాబాద్, చెన్నై లాంటి నగరాలకే మరుసటి రోజుకే డెలివరీ చేస్తుండిన కొరియర్ సర్వీసులు కావలి, గూడూరు నుంచి పంపుతున్న కవర్లను సైతం మూడు, నాలుగు రోజులకు అదీ ఫోన్ చేస్తేనే చిరునామాదారులకు చేరుస్తున్నాయి. కొరియర్ సర్వీసులకు పెరిగిన పని ఒత్తిడికి తగినట్లు సిబ్బందిలేక పోవడమే కారణమనక తప్పదు. దీన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం కొరియర్ సంస్థల నిర్వాహకులకు లేదా?

## జగన్‌కు ఘన స్వాగతం

కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహానికి హాజరవ్వను 10వ తేది నెల్లూరు వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. గుంటూరు నుంచి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు వచ్చిన ఆయన కోసం రైల్వేస్టేషన్‌లో ఒంటి గంట నుంచే కార్యకర్తలు ఎదురు చూశారు. రైలు ఆలస్యంగా వేకువన నాలుగు గంటలకు వచ్చినా జేజేలు పలుకుతూ దర్గామిట్టలోని ఎమ్మీ మేక పాటి రాజమోహన్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌కు తీసుకెళ్లారు. కనుపర్తిపాడులో వివాహ వేదిక వద్దకు వచ్చిన జగన్‌ను చూడను జనం ఎగబడ్డారు. వధూవరులను ఆశీర్వదించిన అనంతరం జగన్ పొదలకూరు రోడ్డులో జడ్పీ మాజీ ఛైర్మన్ బాల చెన్నయ్య కట్టిన వైఎస్ఆర్ ప్రజావైద్యశాలను ప్రారంభించారు. డైకస్‌రోడ్డు సెంటర్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

## సిపిఐ జిల్లా కార్యదర్శిగా పి.రామరాజు!

ఎఐటియుసి విభాగం అధినేతగా కార్మిక విభాగంలో పట్టున్న నాయకుడు పి.రామరాజును సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎట్టకేలకు ఎన్నుకొన్నారు. గునుపాటి రామచంద్రయ్య తర్వాత పముజుల దశరధరామయ్య చాలా రోజులు సిపిఐ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. వయోభారంతో ఆయన తప్పుకోవడంతో రామరాజుకు అడ్డులేకుండా పోయింది. పార్టీ తనను నిర్లక్ష్యం చేస్తున్నదని గత ఏడాది రామరాజు రాజీనామాకు సిద్ధపడినప్పుడు రాష్ట్ర కార్యదర్శి నారాయణ సముదాయించి ఇప్పుడు ఆయన జిల్లా కార్యదర్శి అయ్యేందుకు సహకరించారు. ఈ పదవిలో రామరాజు ఏ విధంగా రాణిస్తాడో చూడాలి.

## జాఫర్ భాయ్ వచ్చారు.

రైల్వే శాఖ మాజీ మంత్రి, సిడబ్ల్యుసి సభ్యుడు జాఫర్ షరీఫ్ హెలికాప్టర్‌లో నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో దిగారు. బారాషహీద్, కసుమూరు మస్తాన్‌వలీ, పులికాట్ సరస్సులోని వేనాడు దర్గాలను సందర్శించారాయన. ఈ మధ్య కర్నాటక రాజకీయాల్లో ఆయన వన్నె తగ్గింది. దర్గాల సందర్శనలతో బలం పుంజుకోవాలని నెల్లూరు వచ్చినట్లుందాయన.

కొరవ 14వ పేజీలో


సిల్వర్ ఫ్యాక్టరి అవుట్‌లెట్
హోల్‌సేల్ ధరలకే రిటైల్ అమ్మకం
925 STERLING SILVER*
(EXPORT QUALITY)
వెండి వస్తువులపై
కూలి లేదు, తరుగు లేదు.
T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
హోటల్ శివం ఎదురు, ఆచారివీధి,
జిల్లా పరిషత్ సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2331132, 2331121

వజ్రం - బంగారం - వెండి
స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు
గ్రాముకు రూ. 50/- తగ్గింపు
డైమండ్స్‌పై 10% తగ్గింపు
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లాపరిషత్ ఆఫీసు సెంటర్,ఆచారివీధి,
నెల్లూరు. ఫోన్ : 2331133, 2327611





# ఒకే గొడుగు క్రిందకు అన్ని పోలీస్ విభాగాలు!



సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టిన రమణకుమార్.

● ఎస్పీ ప్రయోగం సఫలమయ్యేనా?

నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్, అధికం అవుతున్న దొంగతనాలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖలో మార్పులకు ఎస్పీ రమణకుమార్ శ్రీకారం చుట్టారు. అన్ని విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెచ్చి సమన్వయంతో అందరూ అన్నింటిలోనూ తమ వంతు కర్తవ్య నిర్వహణ చేసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయా స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతలు, నేర విభాగాలు వేరు వేరుగా విధులు నిర్వర్తిస్తున్నాయి. అలాగే ట్రాఫిక్ విభాగం. వీటికి ప్రత్యేకంగా ఎస్ఐలు, సిఐలతోపాటు ఆయా స్టేషన్ల పరిధిలో కానిస్టేబుళ్లు, ఎఎస్ఐలు ఉన్నారు. ఇకపై ఈ మూడింటిని ఒకే గొడుగు క్రిందకు తెచ్చి లా అండ్ ఆర్డర్, క్రైం విభాగాలను కలిపి వారందరూ శాంతి భద్రతల పర్యవేక్షణతోపాటు నేరాలను అరికట్టడం, యాక్సిడెంటు కేసులను దర్యాప్తు చేసేలా ప్రణాళిక రూపొందించారు. దీని వలన ఒకరి కొకరు సమన్వయంతో పనిచేయడం వల్ల దొంగతనాలు అరికట్టబడతాయని శాంతి భద్రతలను కాపాడవచ్చన్నది అధికారుల ఉద్దేశం. అయితే క్రిందిస్థాయి సిబ్బందిలో మాత్రం ఈ ఏర్పాటుపై అసంతృప్తి వ్యక్తమవుతుంది. అదనపు భారం, ఇతరత్రా పనుల వల్ల ఉన్న పనులే సరిగా చేయలేకపోతున్న పరిస్థితుల్లో కొత్త విధానం వల్ల ఒకరిపై ఒకరు చెప్పుకొని సమస్యల పరిష్కారం మరింత జటిలమౌతుందని వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో దామోదర్ ఎస్పీగా ఉండిన కాలంలో ఇలాంటి ప్రయత్నం చేశారు. దీనివల్ల ఉపయోగం కంటే నష్టమే ఎక్కువగా జరిగిందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద ఎస్పీ తీసుకున్న నిర్ణయం ఏ మేరకు సత్ఫలితాలనిస్తుందో వేచి చూడాలి.



విఆర్ కాలేజి గ్రౌండ్‌లో జరిగిన శ్రీనివాస కళ్యాణం.

● కమనీయం

# శ్రీనివాసుని కళ్యాణం

కోట్ల మందికి ఆరాధ్యదైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఫిబ్రవరి 12వ తేది విఆర్ కళాశాల మైదానంలో అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ ప్రాజెక్ట్, శ్రీనివాస కళ్యాణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కనులారా వీక్షించేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున తరలి రావడంతో మైదానం నిండిపోయింది. విఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ చక్రాల జానకిరామ్ కుమారుడు, న్యూజెర్సీలో ఉంటున్న నాగేంద్ర ఆధ్వర్యంలో ఈ కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం వారు భారీగానే ఖర్చు చేశారు. వేదికను తీర్చిదిద్దడానికి ప్రఖ్యాత సినీ కళాదర్శకుడు అశోక్ కుమార్‌ను(ఒక్కడు ఫేం) తీసుకవచ్చారు. ఆయన తన సిబ్బందితో కలసి రెండు రోజులపాటు శ్రమించి దాదాపు 30 లక్షల రూపాయలు వెచ్చించి వేదికను, శ్రీనివాసుని నిలువెత్తు రూపాన్ని, స్వాగత ద్వారాన్ని ఎంతో ఆకర్షణీయంగా రూపొందించారు. 120 అడుగుల పొడవు, 38 అడుగుల ఎత్తుతో 150 మంది ఆశీనులయ్యేలా వేదికను తీర్చిదిద్దారు. బంగారు రంగుతో కుడి ఎడమల శంకు చక్రాలతో, మిరుమిట్లుగొలిపే వేంకటేశ్వరుని ప్రతిమతో అశోక్ వేసిన సెట్టింగ్స్ అతని ప్రతిభకు అద్దం పట్టాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 25వేల మంది కళ్యాణాన్ని చూసేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర కుటుంబసభ్యులతోపాటు జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ సౌరభ్ గౌర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సుధాకర్‌రాజు, బలరామయ్య నాయుడు, టిటిడి అధికారులు రామకృష్ణ, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఆనం సోదరులు అవినీతి సామ్రాట్‌లు!



సోమిరెడ్డి విమర్శ.

అవినీతి, అక్రమాలతో ఆనం సోదరులు నెల్లూరును భ్రష్టుపట్టిస్తున్నారని, అక్రమ ఇసుక వ్యాపారులు, మద్యం సిండికేట్లతో సంబంధాలు పెట్టుకొని అక్రమార్జనకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 11న జిల్లా టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి ఆనం సోదరులపై విరుచుక పడ్డారు. వివేకానందరెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని, వారికి రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీయేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాలను తమ అవినీతితో సర్వనాశనం చేశారని, కార్పొరేషన్‌ను అడ్డం పెట్టుకొని లూటీ చేశారని విమర్శించారు. చంద్రబాబునాయుడును విమర్శించే స్థాయి, అర్హత వివేకానందరెడ్డికి లేదని, ఆయన బతుకేంటో ప్రజలందరికీ తెలుసని తీవ్రంగా మాట్లాడారు. గతంలో మూడు సార్లు వివిధ కారణాల వల్ల ఆనం వివేకానందరెడ్డిపై నేరుగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను నిలపలేకపోయిందని, అందువల్లనే ఆయన ఆ ఎన్నికల్లో గెలవగలిగారన్నారు. ఈసారి మాత్రం ఆయన ఎక్కడ పోటీచేసినా ఓడిస్తామన్నారు. వివేకానంద మతిభ్రమించి అవాకులు చవాకులు మాట్లాడుతున్నాడని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి రమేష్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నేతలు కిలారి వెంకటస్వామి నాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు కొత్త మెనూ!

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకొంటున్న విద్యార్థులకు కొత్త మెనూ అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు అమలుచేస్తున్న మెనూలో కొంత మార్పులు చేయడం జరిగింది. వారంలో ఆరు రోజులు కోడిగుడ్డు, మూడు రోజులు అరటిపండివ్వాలని ప్రభుత్వం నిర్ణయించి తక్షణం అమలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలందాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలందుకున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాస్టల్ వార్డన్లకు సర్కులర్ జారీ చేశారు. ఒక్కో విద్యార్థికి రోజుకు భోజన వసతి కోసం ప్రభుత్వం 17 రూపాయలు ఇస్తుంది. ప్రస్తుత ధరలకు ఇది ఏమాత్రం సరిపోని పరిస్థితి. తాజాగా వారంలో ఆరు రోజులు కోడి గుడ్డు, మూడు రోజులు అరటిపండివ్వాలన్న ఆదేశాలపై వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెస్ ఛార్జీలు పెంచకుండా ప్రస్తుతం ఇస్తున్న నిధుల్లోనే అన్ని వసతులు ఎలా సమకూర్చాలని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల నెల్లూరు పర్యటనకు వచ్చిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పితాని సత్యనారాయణ, కమిషనర్ ఉదయ లక్ష్మి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళితే వారు సమర్థించుకున్నారే తప్ప పరిశీలిస్తామన్న హామీ ఇవ్వలేకపోయారు.

● ట్రాఫిక్ నియంత్రణకు

# సిసి కెమెరాలు

ఫలితమివ్వాలని ఆకాంక్షిద్దాం

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రించడం కోసం త్వరలో సిసి కెమెరాలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో ఈ విధానం అమల్లో ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సిసి కెమెరాలను నగరంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరంలో రోడ్ల విస్తరణ జరగడం లేదు. రోజు రోజుకు వాహనాల సంఖ్య అధికంగా పెరుగుతుంది. ప్రధాన రహదారి ఒక్కటే ఉండడం వల్ల అన్నిరకాల వాహనాలు దీనిపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అన్ని వాహనాలు ఒకే సమయంలో రోడ్డుపైకి రావడం వల్ల అంతరాయం ఏర్పడి సకాలంలో గమ్యం చేరుకోలేక పోతున్నారు. అదీ కాకుండా నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఎక్కడా అమలు జరగడం లేదు. రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేయడం, రాంగ్ రూట్లలో వాహనాలను నడపడం, సిగ్నల్స్ దాటి వెళ్లడం వంటివి జరిగిపోతున్నాయి. ఈ నిబంధనల గురించి వాహన యజమానులకు అవగాహన కల్పించడంతోపాటు సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తారు. వీటిని అమర్చిన ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే నమోదవుతుంది. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా వాహన యజమానికి జరిమానా చెల్లించమని నోటీసు పంపుతారు. దీంతో నిబంధనలు పాటించని వారిని సులభంగా గుర్తిస్తారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థతో ఒప్పందం జరుగనుంది. ఇప్పటికి రెండు పర్యాయాలు ఆ సంస్థకు చెందిన సాంకేతిక సిబ్బంది నగరంలో పర్యటించి వెళ్లినట్లు తెలిసింది.

# రేషన్ కార్డులేదు... సరుకుల కూపన్లు ఇవ్వరు!

జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఏ అధికారి కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. దీంతో పౌరసరఫరాల శాఖ నుంచి రెవిన్యూ శాఖ వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత సంవత్సరంలో రెండు దఫాలుగా నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో రేషన్‌కార్డుల మంజూరుకు అధికసంఖ్యలో దరఖాస్తులందాయి. కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం అర్హులైన పేదలకు బియ్యం, కిరోసిన్ కూపన్లను పంపిణీ చేయాలని నిర్ణయించి పౌరసరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రేషన్ కూపన్ల పంపిణీకి శ్రీకారం చుట్టినా అందరికీ అందించలేక పోయారు. కూపన్ల పంపిణీ బాధ్యతలను రేషన్ షాపు డీలర్లు, విఆర్వోలకు అప్పగించారు. గత నెలలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో కూపన్ల పంపిణీ సక్రమంగా జరగక పోవడంపై ప్రశ్నించారు. ప్రస్తుతం లబ్దిదారుల వివరాలు అందడం లేదని సాకు చూపి కూపన్లు రద్దు చేస్తున్నారు. గత నాలుగు నెలల నుంచి ఈ పంపిణీకి నోచుకోని కూపన్లకు సంబంధించిన బియ్యం డీలర్ల వద్ద ఉంచుకొని రైస్ మిల్లర్లకు విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో లబ్దిదారుల సమాచారం డీలర్లకు తెలుసు. కూపన్లు జారీచేసిన విషయం బయట పెట్టకుండా ఇంకా రాలేదని చెబుతూ మధ్య పెట్టే వారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళితే అక్కడ సరైన సమాధానం చెప్పేవారు లేకుండా పోయారు. కూపన్ల పంపిణీ విధానంపై ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదు. దీంతో పేదలకు అందాల్సిన బియ్యం బయట మార్కెట్‌కు చేరిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులకు కూపన్లు పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

• కావలిలో

## పారిశుద్ధ్యం మెరుగుపడదా?

**నిధుల స్వాహాపర్వం**

కావలి పట్టణంలో వీధులన్నీ చెత్త చెదారాలతో నిండి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. వందల మంది పారిశుద్ధ్య కార్మికులు, వాహనాలు, కోట్ల రూపాయలు నిధులున్నా పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడిన దాఖలాల్లేవు. అటు అధికారులు, ఇటు మాజీ కౌన్సిలర్లు ఎవరికి వారు అందినంత దోచుకతింటున్నారు తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటవుతున్న సొసైటీలు బినామిల పేర్లతో కాంట్రాక్టును చేజిక్కించుకొని కార్మికులను పనిలోకి పంపుతున్నట్లు లెక్కలు చూపి ఆ డబ్బులు దిగమింగేస్తున్నారు. తక్కువ మందిని మాత్రమే పనిలోకి పెట్టి మిగతా వారిని కేవలం లెక్కల్లో చూపించి జేబులు నింపుకొంటున్నారు. అలాగే వున్న కార్మికులకు ఇవ్వాల్సిన రోజువారి వేతం 150 రూపాయలలో 30 రూపాయలకు పైగా కోత విధించి ఆ డబ్బును కాంట్రాక్టర్ తినేస్తున్నాడట. అధిక భాగం ఈ పనులను మాజీ కౌన్సిలర్లు చేజిక్కించుకొన్నారు. తమ వాటాలు తమకు వస్తుండడంతో వారు ఆడమన్నట్లు అధికారులు ఆడుతూ పట్టణాన్ని అధ్వాన్నంగా తయారు చేస్తున్నారు.


• కలగా కావలి

## ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

కావలి పట్టణంలో కళుగోళమ్మపేట ప్రాంతంలో నిర్మించదలచిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం ఆప్రాంత వాసులకు కలగానే మిగిలింది. గత ఆరేళ్లుగా శిలాఫలకానికే పరిమితం కావడంతో ఇంకెన్నాళ్లకు దీనిని నిర్మిస్తారో తెలియక ప్రజలలో అయోమయం నెలకొని వుంది. రైల్వే స్టేషన్‌కు ఉత్తరం వైపున వుండే ఈ ప్రాంతంలో పట్టణ ప్రజలు రాకపోకలు సాగిస్తుండడం, వాహనాల రద్దీ అధికంగా వుండడంతో ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు రైల్వే అధికారులు, ఆర్ అండ్‌బి అధికారులు ముందుకు వచ్చారు. 3.2 కోట్ల రూపాయలతో ఈపనులు చేపట్టదలచి శిలాఫలకం వేశారు. తర్వాత నుంచి పనులు ఊపందుకుంటాయని, బ్రిడ్జి పూర్తయితే రాకపోకలకు ఇబ్బంది తొలగిపోతుందని భావించిన ప్రజలకు నిరాశే ఎదురయ్యింది. వంతెన నిర్మాణ పనులు ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో ఎప్పటికి ఇది పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఎదురౌతోంది. దీనికి పడమరవైపున వున్న ప్రాంతం అభివృద్ధి చెందడం, జెబి కళాశాలకు దగ్గరకావడం, చుట్టుప్రక్కల పలుగ్రామాలకు వెళ్లేందుకు బస్సులు ఎక్కేందుకు ఈ మార్గం అనువైనది కావడంతో నిత్యం రద్దీగా వుంటుంది. ఈ పరిస్థితుల్లో రైల్వేక్రాసింగ్ గేటు నిత్యం మూసివేసి వుంటుండడంతో ప్రజల బాధలు వర్ణనాతీతం. రెండుశాఖల మధ్య సమన్వయలోపం కారణంగానే నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదనే ఆరోపణలువున్నాయి. అధికారులు మాత్రం డిజైన్ మార్చాలని ఉన్నతాధికారులు నిర్ణయించడం వలన ఆలస్యం అవుతోందని చెప్తున్నారు.

• అధికారులకు చెమటలు పట్టించిన చింతా!

**ఓజిలి మండలంలో సమీక్షా సమావేశం**



ఎస్సీ, ఎస్టీల విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడవాలని చూస్తే సహించేది లేదని తిరుపతి ఎమ్పీ చింతామోహన్ హెచ్చరించారు. ఓజిలికి వచ్చిన ఆయన స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి సంక్షేమం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వీరి అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నాయని, వాటిని సక్రమంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పథకాలకు సంబంధించి అధికారులను అడిగినప్పుడు వారి నుంచి సరైన సమాధానం రాకపోవడం, అవగాహన లేకుండా సమాధానం ఇవ్వడంతో ఎమ్పీ ఆగ్రహించారు. విద్యాహక్కు చట్టంపై మండల విద్యాధికారిని ప్రశ్నిస్తే ఆయన నీళ్లునమలడంతో మరింత చిరెత్తుక వచ్చింది చింతాకు. విద్యాహక్కు చట్టాన్ని నీరుకార్చడానికి ప్రయత్నిస్తే సహించేదిలేదని, మండల అధికారి అయివుండి కనీసపాటి అవగాహన లేకపోతే ఎలా పని చేస్తారని మండిపడ్డారు. త్వరలో అమలు చేయనున్న ఆహారభద్రత కార్యక్రమం ఇందిర జల ప్రభ పథకంతో ముడిపడి వుందన్నారు. ఈ పథకం క్రింద ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చిన భూములు పూర్తిస్థాయిలో సాగులోకి వచ్చేలా చూడాలన్నారు. సాధ్యమైనంతమేర భూములను అభివృద్ధి చేస్తే ఆహార భద్రతా కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతుందన్నారు. మొత్తం మీద సమీక్షలో అధికారులు సమాచారం సరిగా చెప్పకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తహశీల్దార్ జిలానీబాషా, ఎంపిడిఓ విజయేంద్రకుమార్ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## అటకెక్కిన సాక్షరభారత్

నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన సాక్షర భారత్ జిల్లాలో చతికిలపడింది. 2010 సెప్టెంబర్ 8న ఈ పథకం ప్రవేశపెట్టి 2012 నాటికి 60వేల మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. కానీ ఇప్పటి వరకు 2వేల మందిని కూడా ప్రయోజకులను చేసిన దాఖలాలు లేవంటే ఈ కేంద్రాలు ఎంత బాగా పని చేస్తున్నాయో తేటతెల్లం అవుతుంది. మండల కోఆర్డినేటర్లు, గ్రామ కోఆర్డినేటర్లను నియమించడంతోపాటు సాక్షరభారత్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యావాలంటీర్ల నియామకం చేపట్టారు. ఇంత జరిగినా అధికారులకు శ్రద్ధలేకపోవడంతో కొద్దిరోజులకే ఈ పథకం అటకెక్కింది. తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, కోవూరు, విడవలూరు, కావలి, బుచ్చి, సంగం, ఉదయగిరి, సీతారామపురం, దక్కిలి, రాపూరులలో ఈ కేంద్రాలకు అడ్రస్ కూడా లేదు. మొక్కుబడి సమావేశాలు నిర్వహించి పుస్తకాల్లో అభివృద్ధిని చూపిస్తూ చేతులు దులుపుకొంటుండడం తప్ప చిత్తశుద్ధిగా పని చేయకపోవడంతో ఎంతోమందిని అక్షరాస్యులుగా చేయాలని ప్రవేశపెట్టిన ఈ పథకం విఫలమైపోయింది. మరో 10 ఏళ్ల గడిచినా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందా అనేది ప్రశ్నార్థకమైంది.

**జిల్లాలో చతికిలపడ్డ పథకం**

## కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గూడూరు పట్టణంలో వివిధ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ ఏడేళ్లకు పైగా అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెబుతూ మోసం చేస్తోందని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకోసం చేస్తున్న ఆందోళనకు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మద్దతివ్వాలని కోరారు. వీరి పిలుపుకు స్పందించిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులు కళాశాలల తరగతులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం కూడలి వద్దకు చేరుకొని ధర్నా చేపట్టారు. దీని వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ధర్నానంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## జాబు వెన్నుపోటు సామ్రాట్

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలుగుదేశంపార్టీ నేత చంద్రబాబునాయుడు మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడిన విషయం మంత్రి డిఎల్ రవీంద్రరెడ్డి వ్యాఖ్యలతో తేటతెల్లమైందని కోవూరు మాజీ శాసనసభ్యుడు ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇదంతా ఒట్టిదేనని చెప్పుకొచ్చిన కాంగ్రెస్ నేతలు డిఎల్ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలన్నారు. ఇంటింటా ఎన్నికల ప్రచారంలో భాగంగా కోవూరులోని జంగం వీధి, లక్ష్మీనగర్, శివాజీనగర్ తదితర ప్రాంతాలలో పర్యటించిన ఆయన కాంగ్రెస్, టిడిపి తీరుపై విమర్శలు చేశారు. ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి రాజకీయ వారసులు లేరని చెప్పేహక్కు చంద్రబాబుకు లేదన్నారు. కూతుర్ని ఇచ్చి అల్లుడిని చేసుకొన్నందుకు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన్ను మానసికంగా హత్య చేసిన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. దొడ్డిదారిన టిడిపి పగ్గాలు చేపట్టిన బాబుకు ఆ పదవిలో కొనసాగే హక్కు లేదన్నారు. ఇక ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి కనీసపాటి అవగాహన లేకుండా మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. కోవూరు ఉప ఎన్నికల్లో టిడిపి, కాంగ్రెస్ పార్టీలు ఏకమై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినైన తనను ఓడించేందుకు ప్రయత్నించినా ఆశ్చర్యపోనక్కర లేదన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు జగన్ పట్ల అభిమానం చూపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, సునీల్, నిరంజన్‌బాబు, నరసింహులురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలను పీక్కోతింటాడు!

**బోగోలు విఆర్వో సామాన్యుడు కాడు**

వివిధ సమస్యలపై వచ్చే ప్రజల నుంచి లంచాలు పీక్కుతింటూ రాబందులా మారాడట బోగోలు విఆర్ఓ. దాదాపు పదేళ్లుగా ఇక్కడే పాతుకపోయి విధులు నిర్వహిస్తున్న ఇతని దెబ్బకు ప్రజలు హడలిపోతున్నారు. ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి అది చేతిలో పడితేనే పని, లేకుంటే నెలల తరబడి తిప్పుకోవడం ఇతని నైజం అట. రైతులకు పాస్‌బుక్‌లు కావాలన్నా, అడంగళ్ కావాలన్నా, 500 నుంచి 1000 రూపాయలు చెల్లించాల్సిందే. ఇక స్కూలు పిల్లలకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇతరత్రా సర్టిఫికేట్లు కావాలన్నా చేయితడపాల్సిందే. లేదంటే కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలసిపోవాల్సిందే తప్ప పని చేయదట. నెల్లూరు నుంచి రాకపోకలు సాగించే ఈ విఆర్ఓ ఎప్పుడు విధులకు వస్తాడో ఎప్పుడు పోతాడో, ఎక్కడ దొరుకుతాడో ఎవరికి తెలియదు. పలుమార్లు ఇతని వ్యవహారశైలికి, లంచాల తీవ్రతకు విసిగి వేసారిన ప్రజలు ఉన్నతాధికార్లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందట. పద్ధతి మార్చుకోమని పలుమార్లు తహశీల్దార్లు హెచ్చరించినా ఖాతరు చేయక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో విఆర్ఓ పేరు మండలస్థాయిలో మహా లంచావతారుడిగా మారుమ్రోగిపోతోంది. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని ప్రజలను పీడించుకతినే ఇలాంటి వారిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుకొంటున్నారు.

## భెల్ పనులు నిదానం

వెంకటగిరి సమీపంలో మన్నవరం వద్ద ఏర్పాటవుతున్న భెల్ పరిశ్రమ నిర్మాణాల జాప్యంపై ఎన్‌బిపిపిఎల్ పరిశ్రమ డైరెక్టర్ల బృందం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఫిబ్రవరి 3న మన్నవరం వచ్చిన ఈ బృందం పరిశ్రమను సందర్శించింది. నెలరోజులు కావస్తున్నా పరిపాలనా భవనం పూర్తికాకపోవడంపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. తొలి దశ నిర్మాణాలు నిర్ణీత గడువు ప్రకారం ఆగస్టు నెలలోపల పూర్తి కావాల్సుండగా, 2013 నాటికి కూడా పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదన్నారు. ఇకనైనా వేగవంతంగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ జాప్యం ఫలితంగా నిరుద్యోగులకు ఉపాధి దొరకడం ఆలస్యం కావడంతోపాటు భూములు కొనుగోలు చేసిన వారు నష్టపోయే పరిస్థితుంది. ఈ నేపథ్యంలో కేంద్ర బృందం పరిశీలన జరిపి అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది.

# ఆదర్శ రైతులకు పరీక్షలు

## ఆలస్యంగా మేల్కొన్న ప్రభుత్వం

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా వుంది ఆదర్శరైతుల ఎంపికకు ప్రభుత్వం మార్గ దర్శకాలు విడుదల చేయడం. రైతులకు ఆదర్శంగా నిలచేలా సాగు చేపట్టిన వారిని ఎంపిక చేసి వారి ద్వారా రైతులకు సలహాలు అందిస్తూ వారిని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఆదర్శరైతుల వ్యవస్థను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ ఎంపికల్లో రాజకీయ జోక్యం చోటు చేసుకోవడంతో రైతులు కాని వారు, వ్యవసాయం గురించి అవగాహన లేనివారు, కొందరు విలేకరులు, ప్రైవేట్ ఉద్యోగులకు పునరావాసంగా మారింది. ఆదర్శ రైతులకు అర్థమేలేకుండా పోయింది. ఆదర్శ రైతులు గ్రామాల్లో పత్తాలేకుండా రైతులకు అందుబాటులో లేకుండాపోవడంతో వారిని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆలస్యంగా ఈ విషయంలో జరిగిన తప్పిదాలను గమనించిన ప్రభుత్వం ఇకపై వీరి ఎంపికలకు అర్హత పరీక్షలను నిర్వహించేలా మార్గదర్శకాలతో కూడిన జీవో 1298 జారీ చేసింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వీరికి పరీక్షలు నిర్వహించనున్నారు. 100 మార్కులకు ప్రతిభాపరీక్షలు పెట్టనున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు పెట్టి, 70 మార్కులు వస్తే గుడ్ అని, 50 వస్తే యావరేజ్ అని, అంతకు తగ్గితే పూర్ అని నిర్ణయించి వారిని తొలగిస్తారట. మొత్తం మీద ఈ పరీక్షలు దర్జాగా ఆదర్శరైతులమని చెప్పుకొని తిరిగే వారికి తంటాలు తెచ్చి పెట్టాయి.



బిట్రగుంట రైల్వే స్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న కోవూరుపల్లి పిహెచ్‌సి డాక్టర్ కవితా వసుంధర. చిత్రంలో డిపిఓ అనంతరామిరెడ్డి, డాక్టర్ జోసఫ్ వున్నారు.

# మందుల షాపుల్లో వ్యాక్సిన్లు ప్రత్యక్షం!

ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం, చిన్నారుల భద్రతను దృష్టిలో పెట్టుకొని అందిస్తున్న వ్యాక్సిన్‌లు ప్రైవేట్ మందుల షాపులకు తరలిపోతున్నాయి. దీంతో ప్రభుత్వ ఉద్దేశం

## ప్రభుత్వాస్పత్రుల్లో మాయం

దెబ్బతినిపోతోంది. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అక్రమాల ఫలితంగా ఈ భాగోతం జరుగుతున్నా ఎవరు పట్టించుకోకపోవడంతో కావలి నియోజకవర్గంలో ఈ వ్యాక్సిన్లలు నేరుగా మందుల దుకాణాల్లో ప్రత్యక్షమవుతున్నాయట. చిన్న పిల్లలకు పోలియో తదితర వ్యాధులు దరిచేరకుండా వుండేందుకు చుక్కల మందులు, వ్యాక్సిన్‌లు ప్రభుత్వం వైద్య సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాలలోని వారికి వేసేలా చర్యలు చేపట్టింది. అయితే సిబ్బంది నిర్లక్ష్యానికి తోడు అక్రమంగా జేబులు నింపుకోవాలన్న ఆశతోడవడంతో ప్రభుత్వం అందజేసే ఖరీదైన వ్యాక్సిన్లను అమ్మేసి సొమ్ము చేసుకొంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులతో ఒప్పందం కుదుర్చుకొని రహస్యంగా తరలించి అందినంత దోచుకొంటున్నారు. బోగోలు, కావలి, దగదర్తి, అల్లూరు తదితర మండలాల్లో ప్రభుత్వ వ్యాక్సిన్‌లు అధికంగా ప్రైవేట్ మందుల వ్యాపారుల వద్ద వుంటున్నాయట. చౌకగా వైద్య సిబ్బంది నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు వీటిని అధిక ధరలకు విక్రయించి ఆదాయం గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఏ అధికారి దీనిపై పెదవి విప్పకపోవడంతో ఈ అక్రమాలకు అడ్డే లేకుండాపోతోంది.

## వెంకటగిరి సిఐటియూ కార్యవర్గం

### ఐక్యంగా ముందడుగుకు తీర్మానం

వెంకటగిరి పట్టణ సిఐటియూ నూతన కార్యవర్గాన్ని ఇటీవల జరిగిన మహాసభల సందర్భంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా సిహెచ్.ఉదయ భాస్కర్, కార్యదర్శిగా వడ్డిపల్లి చెంగయ్య, సహాయ కార్యదర్శిగా మంజులమ్మ, కోశాధికారిగా ఎస్‌కె. మమోలాబేగం, కమిటీ సభ్యులుగా గుర్నాధం, భాగ్యమ్మ, రవి, శ్రీదేవి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిఐటియూ జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రంగాలకు చెందిన కార్మికులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అవినీతి ఊబిలో కూరుకపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల బాగోగులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు నోచని గిరిజనులు

పేదలకు గృహవసతి కల్పించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికీ అర్హులైనవారికి అందడం లేదు అనేందుకు చిల్లకూరు మండలం ముత్యాలపాడు పంచాయితీ ఉదాహరణ. ఈ పంచాయితీ పరిధిలోగల నాంచారమ్మ పేట గిరిజన కాలనీ వాసులకు గృహవసతి లభించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టి పలు దఫాలుగా ఇళ్లను కేటాయించినప్పటికి మొదటి విడత నుండి ఇప్పటివరకు పలుమార్లు గిరిజనులు తమకు పక్కాఇళ్లు కేటాయించమని అడుగుతున్నా పట్టించుకొన్న నాధుడే లేకుండాపోయాడు. అందులోను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన ప్రాంతంలోగల గిరిజనులకు ఇంత అన్యాయం జరగడం సిగ్గుపడాల్సిన విషయం. అధికారులు ఈవైపే కన్నెత్తి చూడకపోవడంతో గిరిజనులు గుడిసెలలోనే బిక్కుబిక్కుమంటూ తలదాచుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యుత్ సౌకర్యానికి నోచుకోని అభాగ్యులు వీరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గిరిజనుల బ్రతుకుల్లో వెలుగులు నింపేలా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని స్థానికులు కోరుకొంటున్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికం కావడంతో గూడూరు పట్టణ పోలీసులు నివారణ చర్యలకు పూనుకొన్నారు. డిఎస్పీ చొరవ తీసుకొని పట్టణ సమీపంలోని పోటుపాళెం కూడలి వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయించారు. దివ్య ట్రస్టు వారి సహకారంతో పోలీస్ వీటిని పెట్టారు. దీని వలన జాతీయ రహదారిపై ఆయాకూడళ్ల వద్ద వచ్చేపోయే వాహనాల వేగం తగ్గి ప్రమాదాలను కొంతమేర నివారించే అవకాశం వుందని డిఎస్పీ అభిప్రాయపడ్డారు. పోలీసు చేపట్టిన ఈ పనిని పలువురు ప్రజలు అభినందిస్తున్నారు. అలాగే ఆదిశంకర కాలేజి వద్ద, వరగలి అడ్డరోడ్డు వద్ద ఇలాంటి బారికేడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుకొంటున్నారు.


## బాష్పాంజలి - ఏకాదశ వర్ధంతి



శ్రీమతి అక్కరాజు లక్ష్మి

జననం: 10-03-1936 మరణం: 14-02-2001

భర్త : A.T. శ్రీనివాసరావు
Retd. HOD, V.R.C, Nellore

కుమారుడు : A. వెంకటరమణ, M.Tech
Port trust, vizag

కోడలు : A. సుష్మ, B.Tech,

కుమార్తెలు : R.S. భువనేశ్వరి, MA MEd.,
K. జానకి, MSc., BEd.,
T. పద్మజ, MSc, Phd., (USA)

అల్లుళ్లు : Major General R.S. Kumar,
CEO. NSDM, New Delhi
Dr. K.V.L.N. Rao, BSc., MBBS
Dr. TVSH. Prasad, M.S. Phd.,(U.S.A)

మనుమలు : Dr.R. ధీరజ్, MBBS
A. విశ్వత్ విత్

మనుమరాళ్లు : R. సంధ్య, B.Tech (USA)
R. విష్ణుప్రియ, 4th year B.Tech
J. జ్యోత్స్న, M.S (USA)
A. ఋతిక, T. శ్రావ్య, T. సౌమ్య


# కొత్తూరు రోడ్డు ఘోరం!

## సిమెంట్ రోడ్డంటే చూసి ఆశ్చర్యపోవాలి.

రోడ్డు నిర్మాణాల పేరుతో కాంట్రాక్టర్లు ఎంత నాసిరకంగా రోడ్లు నిర్మిస్తున్నారనేందుకు బోగోలు మండలం కొత్తూరు గ్రామంలో నిర్మించిన సిమెంటురోడ్డే నిదర్శనం. విశ్వనాధరావుపేట పంచాయితీ పరిధిలో గల ఈ గ్రామంలో సిమెంటురోడ్డు నిర్మించారు. తెలుగుదేశం పార్టీ మండల స్థాయినేత, జిల్లా తెలుగురైతు నాయకుడు వీరిరువురు కలసి ఈ రోడ్డు కాంట్రాక్టు పొంది వేసిన రోడ్డు నామరూపాలు లేకుండా పోయింది. ఎవరి కన్నా ఇది సిమెంటురోడ్డు అని చెప్పినా నమ్మలేనంతగా రూపురేఖలు కోల్పోయి, కంకర తప్ప మచ్చుకైనా సిమెంటు కన్పడనంత ఘోరంగా వుంది రోడ్డు. దారుణంగా దెబ్బతినిపోయిన ఈ రోడ్డుపై వాహనాలు తిరగలేకపోవడంతోపాటు కనీసం నడవలేని విధంగా తయారైంది. కంకర రాళ్లు వాహనాల టైర్లను దెబ్బతీస్తుండడంతో మరమ్మత్తులకు గురికావడం, పంక్చర్లు కావడం జరుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. రెండు వేల మంది జనాభాగల ఈ ప్రాంతంలో అసలే మౌలిక వసతులు కరువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. దీనికితోడు ఆర్భాటంగా నిర్మించిన రోడ్డు కాస్త కొద్దికాలానికే నామరూపాలు లేకుండాపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యతాప్రమాణాలు తనిఖీ చేయక పోవడం, కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మించడంతో అది ఈ గ్రామస్తుల పాలిట శాపంగా పరిణమించింది.



# ప్రిన్సిపాల్ వైవి సంస్మరణ సభ

వెంకటగిరి విశ్వోదయ కళాశాల ఏర్పడిన తొలినాళ్లలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇటీవల మరణించిన వైవి చలపతిరావు సంస్మరణ సభ ఫిబ్రవరి 5న జరిగింది. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌విఎం హైస్కూల్ ప్రాంగణంలో దీనిని నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన ఘనత చలపతిరావుదని పలువురు కొనియాడారు. పదేళ్లపాటు ప్రిన్సిపాల్‌గా వుండిన ఆయన రాష్ట్రంలోని పలువురు రాజకీయ, సినీరంగ ప్రముఖులను విశ్వోదయ వార్షికోత్సవాలకు తీసుకొచ్చారని గుర్తు చేసుకొన్నారు. ఆయన కృషి ఫలితంగా కళాశాలతోపాటు పలువురు విద్యార్థులు ఎంతో పురోభివృద్ధి సాధించారన్నారు. వివిధ సందర్భాలలో ప్రిన్సిపాల్‌గా ఆయన వ్యవహరించిన తీరును గుర్తు చేసుకొని ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి చలపతిరావు కుటుంబ సభ్యులతోపాటు విశ్వోదయ వ్యవస్థాపక సభ్యులు సత్యనారాయణ జెట్టి, రిటైర్డ్ లెక్చరర్ సూర్యనారాయణరావు, ఎఎస్ కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థులు బికె ప్రసాద్, మునెయ్య, అల్లం జయరామయ్య, ప్రస్తుత ప్రిన్సిపాల్ మునిరత్నం శెట్టి, ఇఎస్ఎస్ ఛైర్మన్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంటలోని బిఎంఆర్ ట్రస్ట్ ఫుట్‌బాల్ బృందంతో కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు.

# ఆన్‌లైన్‌లో భూసార పరీక్షలు

జిల్లాలో భూసార పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచినట్లు జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్యసంస్థ డైరెక్టర్ బి.గోవిందరాజులు తెలిపారు. డక్కిలి మండలం కమ్మవారిపల్లిలో వరిపొలాలను, నిమ్మతోటలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. భూసార వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టడం వల్ల రైతులకు అనుకూలంగా వుంటుందని, వాటిని తెలుసుకొని అవసరమైన ఎరువులను వినియోగించుకోవచ్చన్నారు. నిమ్మచెట్లకు వస్తున్న తెగుళ్లను ప్రస్తావించిన రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సీజన్‌లో నల్లి తెగులు ఆశించడం వలన ఆకులు రాలిపోయి ఎండు పుల్లలు ఏర్పడుతున్నాయన్నారు. దీనిని నివారించేందుకు నాలుగేళ్లలోపు వున్న నిమ్మ చెట్లకు 50గ్రాముల ప్లోరేట్ గుళికలు ఒక్కో చెట్టుకు వేయడంతోపాటు లీటరు నీటికి 3మి.లీటర్ల డైకోఫాల్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట డక్కిలి వ్యవసాయాధికారి నాగార్జునసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడ చూసినా క్యాట్‌ఫిష్!

## ● నిషేధాజ్ఞలు అమలుపరిచేదెవ్వరు?

క్యాట్‌ఫిష్ పెంపకం జరపరాదని ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ ఆ నిబంధనలు అమలు కావడం లేదు. ఇందుకూరుపేట మండలంలోని పలు ప్రాంతాల్లో క్యాట్‌ఫిష్ పెంపకం విస్తృతంగా జరుగుతోంది. మైపాడు తీరప్రాంతంతోపాటు నెల్లూరు రూరల్ పరిధిలోకి వచ్చే కొన్ని గ్రామాల్లోనూ ఈ పెంపకం చేస్తున్నా మత్స్యశాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం ఈ ప్రాంతాల నుంచి క్యాట్‌ఫిష్‌ను ఆటోల్లో తరలించుకపోతున్నా సంబంధితశాఖ అధికారులకు కన్పించకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మైపాడు నుంచి క్యాట్‌ఫిష్‌ను ఆటోల్లో నెల్లూరుకు తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు మైపాడు గేటు సమీపంలో ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మత్స్యశాఖాధికారులకు సమాచారం అందించడంతో నింపాదిగా వచ్చిన వారు వాటిని స్వాధీనం చేసుకొని తమ పనైందని అన్పించారు తప్ప తీరప్రాంత వెంబడి సాగవుతున్న క్యాట్‌ఫిష్‌ను అరికట్టడంపై దృష్టి సారించడంలేదు.

# సమస్యల నిలయం గోపాలపురం

ముత్తుకూరు మండలంలో వివిధ పరిశ్రమలు ఏర్పాటవుతూ అభివృద్ధి జరుగుతున్నా పలు గ్రామాలలో మాత్రం ఈ జాడే కన్పించడం లేదు. కోట్లాది రూపాయలతో పరిశ్రమలు నిర్మితమవుతున్నా చుట్టుప్రక్కల ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలోనే వుంటున్నాయి. దీనికి నిదర్శనం కృష్ణపట్నం పంచాయితీ పరిధిలోని గోపాలపురం గ్రామం. కనీస సౌకర్యాలకు నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు నిర్మించకపోవడం, డ్రైనేజి కాల్వలు ఏర్పాటు కాకపోవడంతో మురుగునీరు వెళ్లే మార్గం లేక రోడ్లపై పారుతుండడంతో మట్టిరోడ్లు మరింత చిందరవందరగా తయారవుతున్నాయి.


# శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం



శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా. (ఆం. ప్ర.) ఫోన్ : 08578- 222240

Email : eo_srikalahasthi@yahoo.co.in

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు - 2012

### తేది 15-02-2012 నుండి 27-02-2012 వరకు

**20-02-2012** సోమవారం **మహాశివరాత్రి**
రాత్రి 9-00గం.లకు **నందిసేవ**

**21-02-2012** మంగళవారం ఉదయం 3గం.లకు
**లింగోద్భవ అభిషేకము.**
ఉదయం 10-30 గంటలకు
**రథోత్సవము**
రాత్రి 8-30గంటలకు
**శ్రీస్వామివారి తెప్పోత్సవము**

**22-02-2012** బుధవారము
**శ్రీస్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం**

**24-02-2012** **గిరిప్రదక్షిణము**



శ్రీ కాళహస్తీశ్వరస్వామివారు  శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా అమ్మవారు

భారత దేశమునందలి అనేక పుణ్యక్షేత్రములలో శ్రీకాళహస్తి మహాక్షేత్రము పరమ పవిత్రమైన ప్రసిద్ధ శివ క్షేత్రము. ఇది దక్షిణ కైలాసము గాను, సద్యోముక్తి క్షేత్రము గాను ప్రసిద్ధి చెందినది. పంచభూత క్షేత్రములలో శ్రీకాళహస్తి వాయు క్షేత్రము. శ్రీ స్వామివారి మహా శివరాత్రి బ్రహ్మోత్సవములు **15-2-2012** నుండి **27-2-2012** వరకు అత్యంత వైభవముగా జరుపుటకు నిర్ణయించబడినది.

పై ఉత్సవముల యందు ప్రఖ్యాతి గాంచిన శ్రీమతి వాణీ జయరాం గారు, శ్రీమతి కళామాస్టరు, శ్రీ శివశంకర్ మాస్టర్, శ్రీ రాజేష్ వైద్య, కలైమామణి సరస్వతీ గారు, సినీనేపధ్య గాయని శ్రీమతి నిత్యసంతోషిని, బ్రహ్మశ్రీ సామవేద షణ్ముగశర్మ తదితర వారిచే ప్రతిరోజు శ్రీ దూర్జటి కళా ప్రాంగణము నందు సాంస్కృతిక కార్యక్రమము ఏర్పాటు చేయబడినవి.

**రాహు కేతు పూజలు సర్పదోష నివారణం.**

టిక్కెట్ రేటు రూ.300/-, రూ.750/- మరియు రూ.1500/-.

ఈ బ్రహ్మోత్సవాలలో యావన్మంది భక్తులు పాల్గొని శ్రీస్వామి, అమ్మవార్లను సేవించి కృపాకటాక్షములకు పాత్రులు కాగలరు.

**యన్. విజయ్‌కుమార్**, M.A.,
Executive Officer & Regional Joint Commissioner

దేవస్థానమునకు సమర్పించు విరాళములకు 80జి క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

# శివభక్తులకు అత్యంత పర్వదినం శివరాత్రి!



శివుడికి సంబంధించిన పండుగలన్నింటిలోనూ ముఖ్యమైనది, అత్యంత పుణ్యప్రదమైనది మహా శివరాత్రి. ప్రతినెల కృష్ణపక్షంలో వచ్చే చతుర్దశి తిథిని మాస శివరాత్రి అంటారు. ప్రతి ఏటా మాఘబహుళ చతుర్దశినాడు చంద్రుడు శివుని జన్మనక్షత్రమైన ఆరుద్రయుక్తుడై నప్పుడు మహాశివరాత్రి వస్తుంది. ఇది శివ భక్తులకు అత్యంత పర్వదినం. ఆనాడే శివుడు లింగాకారంగా ఆవిర్భవించినట్లు శివపురాణంలో వుంది.

మహేశ్వరుడు నిర్గుణ, నిరాకార పరబ్రహ్మ, సర్వ వ్యాపకుడు. సర్వాంతర్యామియై చరాచర జగత్తు అంతటా వ్యాపించి సహజ లక్షణాలతో నిరాకారుడయ్యాడు. భక్తులను అనుగ్రహించేందుకు, ఆశీర్వదించేందుకు సగుణాకార, నిర్గుణాకార ప్రతిరూపమైన శివలింగంగా అవతరించాడు. ఇతర దేవతల మాదిరిగా శిరము, ఇతర అవయవాలు లేకుండా లింగమే ప్రతీకగా నిలచిన దేవదేవుడు. ఈశ్వరుడు లింగోద్భవమూర్తిగా అవతరించడానికి గల కారణాలతో పురాణ గాధ ఒకటి వుంది.

ఒకనాడు బ్రహ్మ, విష్ణుమూర్తుల మధ్య అహంకారం తలెత్తి అది చివరకు ఎవరు ఎంతటి గొప్పవారో తెలుసుకోవాలనే స్థితికి పోటీ పడతారు. దీనిని గమనించిన శివుడు వారిరువురికి కల్గిన అహంభావాన్ని అణగదొక్కి కళ్లు తెరిపించేందుకు గుణపాఠం చెప్పాలన్న ఉద్దేశంతో మాఘమాస బహుళ చతర్దశినాడు వారిరువురి మధ్య జ్యోతిర్లింగంగా రూపుదాల్చాడు. ఆ లింగం యొక్క ఆద్యంతాలను తెలుసుకొని రమ్మంటాడు. అందుకోసం విష్ణుమూర్తి వరాహం రూపం దాల్చి జ్యోతిర్లింగం అడుగుభాగాన్ని తెలుసుకొనేందుకు వెళ్లగా, బ్రహ్మదేవుడు హంస రూపాన్ని దాల్చి శివ లింగం పైభాగాన్ని తెలుసుకొనేందుకు ఆకాశంలోకి ఎగిరాడు. ఇద్దరూ ఆద్యంతాలను కనుగొనలేక ఓడిపోయి పరమేశ్వరుడిని శరణువేడుకొంటారు. అప్పుడు పరమశివుడు తన నిజరూపంతో దర్శనమిచ్చి అనుగ్రహించి వారి అహంకారాన్ని పోగొట్టాడు. బ్రహ్మ విష్ణువులు ఈశ్వరుని ఆధిక్యతను గుర్తించి ఆయన్ను విశేష పూజలతో సేవించి కీర్తించిన పర్వదినమే శివరాత్రి అయ్యింది. మహాశివరాత్రి మహత్య వృత్తాంతం శివ పురాణంలోని విద్యేశ్వర సంహితలో చెప్పబడింది. శివం అంటేనే మంగళం, కళ్యాణం అని అర్థం. 'శి' అంటే పరమేశ్వరుడు, 'వ' అనగా శక్తిరూపం పార్వతిగా చెప్పబడింది. శివరాత్రినాడు విశేషమైన లింగోద్భవ కాలంలో నిర్మల మనస్సుతో శివ పంచాక్షరీ జపిస్తూ ఉపవాస దీక్షతో శివుడిని అర్చిస్తే విశేష పుణ్యఫలం సిద్ధిస్తుందని పురాణ కథనం.

J


## ట్రంకురోడ్డు కబుర్లు




## రూపాయి పెంచారట


నెల్లూరు నగరంలో ఇంటి పన్నుల పెంపకం హేతుబద్ధంగా లేదు. పద్ధతి పాడు లేకుండా పెంచిన వారికి ఇష్టమొచ్చినట్లు పెంచారు. తగ్గించిన వారికి విపరీతంగా తగ్గించేశారు. కానీ ఇంటి పన్నుల పెంపకంపై జనాన్ని పోరాట పంథాలో నడిపే విషయంలో ప్రతిపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. విషయమేమిటంటే నగర రాజకీయాల్లో మరీ ముఖ్యంగా కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పే మాజీ మేయర్ భానుశ్రీ గారికి నగర నడిబొడ్డులోని అరవిందనగర్‌లో విశాలమైన భవంతి ఉంది. ఈ భవంతికి వాస్తవంగా వసూలు చేయాల్సిన ఇంటి పన్ను కన్నా 75 శాతం తక్కువగా పన్ను వసూలు చేస్తున్నారు. ఈ మినహాయింపు చాలదన్నట్లు ఈ మధ్య ఇంటి పన్నుల పెంపకంలో నగరంలో పలువురికి నూరు, నూటయాభై శాతం పెంచిన కార్పొరేషన్ అధికారులు ఆమె భవంతికి మాత్రం కేవలం ఒకే ఒక్క రూపాయి పన్ను పెంచడంపై ట్రంకురోడ్డులో వాడివేడి చర్చజరుగుతుంది.

## నిన్న... నేడు... రేపు...



ఇదేదో సినిమా పేరు కాదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విలక్షణంగా ఫ్లెక్స్‌లలో తీర్చిదిద్ది పెట్టిన శీర్షికలవి. కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె వివాహానికి నెల్లూరు వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నగరంలో ఒకట్రెండు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్‌కు స్వాగతం చెబుతూ పొదలకూరురోడ్డులో నిన్న... నేడు... రేపు... శీర్షికతో పెట్టిన ఫ్లెక్స్‌లలోని మొదటి ఫోటోలో వైఎస్ పంచెకట్టులో ఉండగా, రెండో ఫోటోలో జగన్ ప్యాంటు షర్టులో మూడోది పంచె కట్టులో ఉన్నది పెట్టడంతో అవి జనాన్ని బాగా ఆకర్షించాయి. వీటిగూర్చి చర్చించుకొనేలా చేశాయి.

## ఘనమైన పెళ్లి



పెళ్లంటే నూరేళ్ల పంటని పెద్దలు ఏనాడో చెప్పారు. ఈ వారంలో జరిగిన జడ్పీ మాజీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత, డాక్టర్ అయ్యప్పరంగారెడ్డిల పెళ్లి ఈ మధ్య కాలంలో నెల్లూరులో జరగని ఘనమైన పెళ్లి అని ట్రంకురోడ్డులో ఒకటే చర్చ. ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగు వేసి మరీ ఈ పెళ్లి జరిపించాడు గోవర్ధన్‌రెడ్డి. పెళ్లి మండపాన్ని, ప్రాంగణాన్ని సినీ కళాదర్శకుల చేత సెట్టింగులు వేయించి అందరూ అబ్బురపడేలా చేశారు. రెడ్, గ్రీన్ కార్పెట్లు పరచి అందరికీ ఒకే తరహా స్వాగతం, ఉపాహారంతో చేసిన మర్యాద కొన్నాళ్లు నెల్లూరీయుల నోళ్లలో నానుతూనే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 1068110110004231లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

**జీవిత చందా రూ.1000/-**

**సంవత్సర చందా**

స్వదేశంలో రూ.200/-


విదేశాలకు రూ.1000/-

**జమీన్‌రైతు**

పాగతోట, నెల్లూరు - 524 001


ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190




## మిత్రుడి కోసం...


సిఎం కిరణ్ తన మిత్రుడు , శాసనసభ మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి రాజకీయ పునరావాసం కోసం నానాతంటాలు పడుతున్నా రోజులు మాత్రం కలసి రావడం లేదు. సురేష్‌రెడ్డికి శాసన మండలి సభ్యత్వం ఇప్పించి మంత్రి వర్గంలో చేర్చుకోవాలనుకున్నాడు. అయితే అధిష్టానం ఇందుకు అనుమతించలేదు. ఆ తర్వాత సురేష్‌రెడ్డిని రాజకీయ సలహాదారుగా నియమించుకుంటానంటూ అధిష్టానాన్ని బతిమిలాడుతున్నాడు. సురేష్‌రెడ్డి కోసం 'డి' బ్లాకులో కెవిపి రామచంద్రరావు ఖాళీ చేసిన ఛాంబర్‌ను కూడా రిజర్వ్ చేసి వుంచాడు. ఈ ఛాంబర్ కోసం బొత్సాతో పాటు ఓ పదిమంది మంత్రులు పోటీపడినా సిఎం మాత్రం అంగీకరించలేదు. తీరా సురేష్‌రెడ్డికి రాజకీయ సలహాదారు పోస్టు కష్టమని తేలిపోవడంతో ఇక చేసేది లేక కెవిపి ఛాంబర్‌ను కొత్తగా మంత్రి అయిన ప్రసాదరావుకు కేటాయించాడు సిఎం. ప్రసాదరావు నక్కతోక తొక్కాడంటూ ఈ ఛాంబర్ కోసం ప్రయత్నించి విఫలురైన మంత్రులు గుసగుసలాడుతున్నారు.






## చంచల్‌గూడ జైల్లో వివిపిల గుడి

వివిపిలకు కేంద్రంగా తయారైన చంచల్‌గూడ జైల్లో ఇప్పుడు కొత్తగా సాయిబాబా గుడి వెలిసింది. ఈ గుడిని ప్రభుత్వం కట్టించిందనుకుంటున్నారా? అబ్బే... అదేం కాదండి... జైల్లో వున్న వివిపి ఖైదీలంతా చందా వేసుకొని ముచ్చటపడి మరీ కట్టించుకున్నారు ఈ గుడిని. చంచల్ గూడ జైల్లో ఓ మూల శివాలయం వుంది. అయితే గనుల కింగ్ గాలి జనార్దనరెడ్డి, సీనియర్ ఐఎఎస్‌లు బిపి ఆచార్య, శ్రీలక్ష్మి, జగన్ ఆడిటర్ విజయసాయిరెడ్డి షిర్డీ సాయిబాబా భక్తులట. జైల్లో సాయిబాబా గుడి లేకపోవడంతో తమ పూజలకు ఇబ్బందిగా వుందంటూ జైలు అధికారులకు ఫిర్యాదు చేశారట. అయితే గుడి కట్టించడానికి ప్రభుత్వ నిధులేమీ లేవంటూ జైలు అధికారులు చేతులెత్తేశారట. అయితే డబ్బు విషయంలో వెనకాడాల్సిన అవసరం లేదని, తమకు స్థలం చూపిస్తే చాలంటూ వివిపిలు జైలు అధికారుల్ని కోరారు. శివాలయం ప్రక్కనే సాయిబాబా గుడికట్టుకోమంటూ జైలు అధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గాలి జనార్దనరెడ్డి ఆగమేఘాల మీద సాయిబాబా విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్టించాడట. అంతే కాదు శివాలయానికి పేరు మార్చి శివసాయి ఆలయంగా తీర్చిదిద్దుతున్నారట.... జైల్లోని ఖైదీలంతా సాయి శివాలయాన్ని వివిపిల గుడిగా పిలుస్తున్నారట.



## డీలాపడ్డ డిఎల్


ప్రస్తుత ఆరోగ్యశాఖలో కోత పడ్డాక డిఎల్ రవీంద్రరెడ్డి డీలాపడిపోయాడు. ఈనెల 13వ తేదీ నుంచి ప్రారంభమైన శాసనసభ సమావేశాలకు కూడా డిఎల్ డుమ్మాకొట్టాడు. రాష్ట్రమంత్రిగా వుంటూ విధిగా శాసన సభ సమావేశాలకు హాజరు కావల్సివున్నా డిఎల్ మాత్రం డుమ్మాకొట్టేశాడు. ఒక రోజు కాదు... రెండు రోజులు కాదు... ఏకంగా పదిరోజులదాకా సమావేశాలకు రానంటూ స్పీకర్‌కు లేఖ కూడా రాశాడు. డిఎల్ ప్రవర్తన పట్ల కారాలు మిరియాలు నూరుతున్న సిఎంకు డిఎల్ డుమ్మా పుండుమీద కారం చల్లినట్లయింది. డిఎల్ శాఖకు సంబంధించిన ప్రశ్నల్ని పదిరోజులపాటు వాయిదా వేయాల్సిందిగా స్పీకర్ ఇప్పటికే తన పేషీ సిబ్బందికి చెప్పారట. గతవారం కడపజిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమావేశాన్ని సిఎం తిరుపతిలో ఏర్పాటు చేశాడు. సిఎం మీద కోపంతో డిఎల్ తిరుపతి సమావేశానికి వెళ్లలేదు. ప్రస్తుతం శాసనసభ సమావేశాలకు కూడా డిఎల్ గైర్హాజరు కావడంతో డిఎల్ వర్సెస్ కిరణ్ వివాదం రావణకాష్టంలా తయారయ్యే ప్రమాదం వుందంటున్నాయి గాంధీభవన్ వర్గాలు చూద్దాం... ఏం జరుగుతుందో!!



## గాలి గుప్పెట్లో మద్యం గుట్టు

రాష్ట్రంలో మద్యం సిండికేట్లపై జరుగుతున్న ఎసిబి దాడులకు సంబంధించిన కీలక సమాచారం గాలి ముద్దుకృష్ణమనాయుడు దగ్గర వుందట. మద్యం వ్యాపారంలో జరిగిన మతలబులకు బాధ్యులైన ఎమ్మెల్యేలు, పోలీసు, ఎక్సైజ్ అధికారుల పేర్లతో కూడిన జాబితా కూడా తన వద్ద వుందంటున్నాడు గాలి ముద్దు. ఈ విషయమై సోమవారం నాడు శాసనసభ లాబీల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెవులు కొరుక్కుంటున్నారు. ఎసిబి వద్ద వున్న రహస్య సమాచారం ప్రతిపక్షసభ్యుడైన గాలిముద్దు దగ్గరకు ఎలా వెళ్లిందన్న దానిపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. గాలి ముద్దు దగ్గర నిజంగానే సమాచారం వుందా? లేక ఇది 'గాలి' గ్యాసిప్పా అంటూ సిఎం కిరణ్ కూడా ఆరా తీస్తున్నాడట. చూద్దాం... గాలి సమాచారంలోని నిజానిజాలు ఏమిటో?

## 'చిరు' ఐలవ్‌యు



ఫిబ్రవరి 14... ప్రేమికులరోజు... ఆరోజు రాష్ట్రశాసన సభలో కొత్తగా కాంగ్రెస్ కండువా వేసుకున్న మెగాస్టార్ చిరంజీవిని ప్రేమించడానికి రాష్ట్రముఖ్యమంత్రి కిరణ్‌రెడ్డి, పిసిసి చీఫ్ బొత్సా సత్యనారాయణ పోటీపడ్డారు. చిరంజీవి గారూ... అంటూ కిరణ్... సార్... అంటూ బొత్సా చిరంజీవి వెంటపడ్డారు. రాజకీయాల్లో ఎడమొహం పెడమొహంగా వుంటున్న కిరణ్, బొత్సాలు 'చిరు' విషయంలో మాత్రం పోటీపడడం శాసనసభ్యుల్ని ఆశ్చర్యపరచింది. కొంతకాలంగా చిరంజీవిని తమ వైపుకు తిప్పుకోవడానికి కిరణ్, బొత్సాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రజారాజ్యం పార్టీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవుల్ని ఇప్పించి 'చిరు' మెప్పుపొందటానికి బొత్సా తీవ్రంగా కృషి చేశారు. 'చిరు' నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధుల్ని కేటాయించి 'చిరు' అభిమానం సంపాదించడానికి సిఎం యమ యాతన పడుతున్నాడు. మొత్తానికి చిరంజీవి నక్కతోక తొక్కాడంటూ శాసనసభ్యులంతా చెవులు కొరుక్కుంటున్నారు.






అనుకూలతలు పెరిగి, చేసే పనులందు సహకరించేవారు పెరుగు తారు. ఇంట్లో వివాహాది శుభకార్యాలు నిశ్చయమవుతాయి. మీ మాటకు విలువ యిస్తారు. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుం టుంది. కుటుంబంలో సానుకూలతలు ఏర్పడి సుఖంగా వుంటారు. ఆర్థిక రంగంలోనివారు ఆచితూచి అడుగేయాలి. విద్యార్థులకు చదు వుపై ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగస్తులకు బదలీలకు అవకాశముంది.




ఈవారం అనుకూలతలున్నా ఇంటియందు, కుటుంబ వ్యవహారా లందు ఇబ్బందులుంటాయి. వ్యాపార భాగస్వాములతో జాగ్రత్త, మెలకువ అవసరం. స్పెక్యులేషన్లు పనికిరావు. అవసరానికి రుణాలు చేయవలసిన అవసరం వుంటుంది. వ్యవసాయ రంగంలోని వారికి గతవారం కంటే మేలు. రాజకీయ, కళారంగాలలోనివారు చేసే వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. శత్రువులు అధికం.





గతవారం లాగే చేసే పనులలో మార్పులు లేవు. నూతన వ్యాపారా లకు అనుకూలం. పై అధికారులతో మాట్లాడేటప్పుడు మెలకువ పాటించాలి. స్త్రీ సంబంధమైన విరోధాలు, కష్టాలు రాకుండా జాగ్రత్త పడాలి. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. విద్యార్థులకు, శాస్త్ర వేత్తలకు ప్రోత్సాహం, అవకాశాలు, గుర్తింపు లభిస్తాయి. వ్యవసాయ రంగంలోనివారు ఇతరుల సలహాలు తీసుకొని లబ్ధిపొందగలరు.




ఈవారం చేసే పనులకు అనుకూలంగా వుంటుంది. ఆధ్యాత్మిక, పుణ్యకార్యాలలో పాల్గొంటారు. అన్ని రంగాల వారికి ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థికంగా లాభాలుంటాయి. శరీరారోగ్యం గతం కంటే మెరుగ్గా వుంటుంది. సంతాన విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. కుటుంబ సభ్యులతో బేధాభిప్రాయాలు ఏర్పడగలవు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుంది.




నూతన పనులు ప్రారంభించేందుకు అనుకూలం. మీ పనులకు అవ సరమైన ఆర్థిక సహాయం సకాలంలో అందుతుంది. చేసే ప్రయా ణాలు అసౌకర్యం కలిగించినా ప్రయోజనం కలుగుతుంది. రావల సిన బకాయిలు కొంతవరకైనా రాగలవు. ఇతరులతో వ్యవహరించు నప్పుడు వివాదాలు రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ రంగం లోని వారికి ఆర్థిక ఇబ్బందులుంటాయి.




చేసే పనులందు, ఆర్థికంగా లాభనష్టాలు సరిసమానంగా వుం టాయి. సాహసంగా, దూకుడుగా చేసే పనులకు దూరంగా వుం డండి. వ్యవసాయ రంగంలోని వారికి ఆందోళన వుంటుంది. ఇంటా బయటా మాట పడక తప్పదు. ఇతరులతో ఘర్షణ రాకుండా చూసు కోవాలి. వ్యాపార భాగస్వాములతో విభేదాలు రావచ్చు. శరీరా రోగ్య లోపం, ధన వ్యయం, కార్యభంగం, ఉదాసీనత వుండవచ్చు.

# వారఫలాలు

*తేది 18-02-2012 నుండి 24-02-2012 వరకు మేషంలో గురువు; వృషభంలో కేతువు; సింహంలో కుజుడు; తులలో శని; వృశ్చికంలో రాహువు; కుంభంలో రవి, బుధులు; మీనంలో శుక్రుడు; ధనుర్మకర, కుంభ, మీనాలలలో చంద్రుడు సంచరిస్తారు.*

## పంచాంగం

20తేది మహాశివరాత్రి పర్వదినం.

**శుభ ముహూర్తాలు**

24, 25తేదీలలో వివాహ, గృహారంభ, గృహప్రవేశ, నూతన వ్యాపార, అన్నప్రాసన, నామకరణ, ప్రతిష్టాదులకు సుముహూర్తాలున్నాయి.

**ఫిబ్రవరి తిథులు**

**మాఘ బహుళ**

| | | | | |
|---|---|---|---|---|
| 18 | శని | ద్వాదశి | తె 04.38 | గం.ల.వ |
| 19 | ఆది | త్రయోదశి | తె 04.03 | గం.ల.వ |
| 20 | సోమ | చతుర్దశి | రా 03.50 | గం.ల.వ |
| 21 | మంగళ | అమావాస్య | ఉ 04.03 | గం.ల.వ |

**ఫాల్గుణ శుద్ధ**

| | | | | |
|---|---|---|---|---|
| 22 | బుధ | పాడ్యమి | తె 04.43 | గం.ల.వ |
| 23 | గురు | విదియ | తె 05.55 | గం.ల.వ |
| 24 | శుక్ర | తదియ | పూర్తిగా | |

**అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం**
7/34, డిఎస్ఆర్ నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.




చేసే పనులలో కొంత భయాందోళనలున్నా ముఖ్యమైన పనులు పూర్తి చేయగల్గుతారు. ఆర్థికంగా కొంత అనుకూలంగా వుం టుంది. విద్యార్థులకు అనుకూలం. స్థిరాస్తుల కొనుగోలులో జాగ్రత్త అవసరం. దూరప్రాంత, విదేశీ ప్రయాణాలుంటాయి. రుణ బాధలు బాధిస్తాయి. రాజకీయ రంగంలోనివారు బయటవారి సహాయ సహకారాలు అందినప్పటికి అనవసర ఆందోళనకు గురౌతారు.





గతవారం కంటే కొంత మేలుగా వుంటుంది. చేసే పనులు అనుకూ లిస్తాయి. ప్రయాణాలు సౌఖ్యంగా సాగి ప్రయోజనాలుంటాయి. నూతన వ్యాపారం చేసేవారికి భాగస్వాములతో అనుకూలిస్తుంది. కుటుంబంలో సుఖసంతోషాలుంటాయి. శుభకార్యాలలో పాల్గొం టారు. విద్యార్థుల భవిష్యత్ కార్యక్రమాలను నిర్ణయించుకోవడం మంచిది. కోర్టు వ్యవహారాలు వాయిదా వేసుకోవడం మంచిది.




ఆదాయ వ్యయాలు సరిసమానంగా వుంటాయి. ఈ వారం సామా న్యంగా వుంటుంది. ఇంటాబయట స్వల్ప ఒత్తిడులున్నప్పటికీ సమ ర్థించుకోగలరు. కుటుంబ వ్యవహారాలలో పెద్దలతో జరుపు చర్చలు అనుకూలిస్తాయి. పిల్లల వివాహాది శుభకార్యాలు నెరవేరుస్తారు. ఆర్థిక వ్యవహారాలను సమర్థతతో వ్యవహరిస్తారు. వ్యవసాయ రం గంలోని వారికి అనుకూలం.




చేసే పనులందు, కుటుంబ, ఆర్థిక, సామాజికాలందు చిన్న ఇబ్బందు లున్నప్పటికీ నెరవేర్చగలరు. ప్రతి పని స్వశక్తితో చేపట్టుట మంచిది. ప్రయాణాలందు, సంతాన విషయంలో జాగ్రత్త అవసరం. ఆదా యానికి మించి ఖర్చులు. విద్యార్థులకు ప్రోత్సాహకరమైన వారం. ఉద్యోగస్తులకు బదలీలు, అపవాదులు, మానసిక అశాంతి వుం టుంది. వ్యవసాయ రంగంలోని వారికి ఆర్థిక, శారీరక ఇబ్బందులు.




చేసే పనులు మందగిస్తాయి. అనుకోని ఖర్చులుంటాయి. సంతాన విషయంలో ముఖ్యమైన నిర్ణయం తీసుకొంటారు. విద్యార్థులు ఓర్పు నేర్పుతో వ్యవహరించాలి. అధిక ధన వ్యయం. బంధుమిత్రులతో వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. ప్రయాణాలలో, వాహనం నడిపే టప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల వల్ల ఇబ్బందులు. రాజ కీయ రంగంలోని వారు తొందరపడి వాగ్దానాలు చేయకూడదు.




ఈ వారం అనుకూలతలుండి కొంత వరకు రుణ విముక్తులౌతారు. ఇంట్లో సుఖశాంతులుంటాయి. నూతన వ్యాపార, ఇతర విషయా లపై ఆసక్తి వున్నా ఆచరణలో వుండవు. వాహన ప్రయాణాలందు జాగ్రత్త అవసరం. విద్యార్థులకు బాగుంటుంది. రాజకీయ రంగం లోనివారికి అనుకూలమైన కాలం. వ్యవసాయ రంగంలోని వారికి శారీరక ఇబ్బందులు, ధన నష్టం కలుగుతాయి.

# పశ్చిమ దక్షిణాలలో ఫలవృక్షాలు పెంచుకోవచ్చు!

*కె.ఉమావసునందన్ బెంగుళూరు*

** వృక్షాలు ఏ దిక్కుల్లో పెంచుకోవచ్చు? వృక్ష వేధ ఏమిటి?*

పశ్చిమ, దక్షిణాలలో ఫల వృక్షాలు పెంచు కోవచ్చు. వృక్షం ఫలించి ఎండిన తర్వాతగానీ తీయకూడదు. అలా చేస్తే విపరీత ఫలితాలుం టాయి. దాన్నే వృక్ష వేధ అన్నారు.

*ఎన్.శారదాంబ హైదరాబాద్*

** ఇంట్లో పిల్లల పరిస్థితి బాగోలేదు. ఏం చేయాలి?*

పిల్లల జాతకాలు రాయించి వాటి ఫలితా లను బట్టి రాళ్లు ధరింపజేసి పిల్లలలో అశ్రద్ధ, సోమరితనం తగ్గించడానికి 'లక్ష్మీగణపతి' యంత్ర ప్రతిష్ట చేయడం మంచి ఫలితాలనిస్తాయి.

*ఇ.డి.ఈశ్వరరావు రాజమండ్రి*

** అపార్టుమెంటులో 'ప్లాట్లు' వాస్తుపరంగా సరిచేసుకోవచ్చా?*

నిర్మాణ దశలో 'ప్లాట్ల'ను సరిచేసుకోవచ్చు. అయితే బాహ్య అవాస్తు దోషాల్ని సరిచేయడం వీలుపడదు. బాహ్య దోషాలకు సంబంధిత యంత్ర ప్రతిష్ట తప్పనిసరి.

*జి.సుభద్రాదేవి అంకుసూలపాడు*

** చెట్టును తప్పనిసరిగా కొట్టి వేయాలి. చేయవలసిన కర్మలేవి?*

ఒక చెట్టుకు పది చెట్లను నాటి, పోషించి, పెంచాలి. ఇది వేధో నివారణి. దైవ గృహంలో 'శీతల యంత్ర' ప్రతిష్టచేసి వృక్షాన్ని తొలగించాలి.

*ఎఫ్.శంకరనారాయణ తిరుపతి*

** వాస్తు, జ్యోతిషాల విషయంలో అసంతృ ప్తిగా ఉంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా చెబుతు న్నారు.*

లబ్ధప్రతిష్టులైన శాస్త్రవేత్తల్ని ఎంపిక చేసు కొని, ఆ వ్యక్తుల్నే త్రికరణశుద్ధిగా నమ్మి, వారు చెప్పింది పాటిస్తే మీరు చెప్పిన ప్రశ్న ఊసేరాదు.

*కె.పి.అమరేంద్ర హైదరాబాద్*

** గృహాన్ని నిర్మించాలనుకుంటున్నాను. ప్రాథమిక సూత్రాలు చెప్పండి.*

స్థలం భూమిలో బొగ్గు, వెంట్రుకలు, ఎము కలు లేవని నిర్ధారించుకొన్నాక లే అవుట్ దోషాల్ని స్థలంలో రాకుండా సరిచేసి, నిర్మాణం మూలమట్టా నికి వచ్చేలా చూసుకోవడం, అయిదు స్థితులలో గృహాన్ని వాస్తు సిద్ధాంతికి చూపించడం మంచిది.

*జె.ఎన్.విశ్వనాధరావు కలిగిరి*

** తూర్పు ఈశాన్యం స్థలమైనా, ఇల్లు కట్టలేక పోతున్నాను. ఎందువల్ల?*

వీధులు ఎక్కడా ఆగకుండా వెళ్లిపోతేనే ఈశా న్యం ఫలితం. మీ వీధుల్లో ఉత్తరం వీధి ఆగిపో తుంది. అందువల్ల ఈశాన్య ఫలితం మీకు దక్కదు. గృహం దిక్కు, మీ జన్మతేదీకి వచ్చే యంత్రాన్ని ప్రతిష్టించుకోండి.

## వాస్తు సందేహాలు సమాధానాలు

**ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి**
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

*సి.హెచ్.సుందరరామిశాస్త్రి ఒంగోలు*

** అష్టమి, నవమి, చతుర్దశులలో వివా హాలు ఎట్లా చేస్తున్నారు.*

వధూవరుల నక్షత్ర రాశులను బట్టి ఆయా రోజులలో ఉపయుక్తమైతే శుభ, అమృత ఘడి యల్లో వివాహం చేయవచ్చని పెద్దలు, శాస్త్రాలు చెబుతున్నాయి.

*పైడి శకుంతల నాయుడుపేట*

** వృక్షం శపిస్తుందా? దానికి పరిష్కారం ఏమిటి?*

వృక్షం కూడా జీవే. మరణించే ముందు అది చేసే ఘోష మన పాలిట శాపమవుతుంది. వన దేవతలు తథాస్తు అంటారట. వృక్షవేధకు ఎనిమిది రకాల యంత్రాలను శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

*వి.నరహరిశాస్త్రి సికింద్రాబాద్*

** ముహూర్తం చూసి, జాతకాలు చూసి వివాహాలు ఖాయంచేస్తే సమస్యలెందుకు వస్తు న్నాయి.*

చాలా మంచి ప్రశ్న. జ్యోతిషం, వాస్తులు యాభై శాతం ప్రభావం చూపిస్తే 'విధి లిఖితం' మిగతా యాభై శాతం ప్రభావాన్ని చూపిస్తుంది. విధి లిఖితాన్ని, శాస్త్రాలే గమనించలేనపుడు మాన వుల శక్తి ఏ పాటిది?

*డి.శేషగిరిరావు కలువాయి*

** మాది దక్షిణం ఇల్లు ఎదురుగా వీధి వస్తున్నది.*

కనుక గోడలో 'వినాయక' ప్రతిష్టకన్నా 'నర ఘోష యంత్ర' ప్రతిష్ట మేలు.

# సెజ్‌లకు భూమి కేటాయింపులపై ఎసిబి విచారణ!

**జిల్లాలోని ఆర్థిక మండళ్ల కోసం సేకరించిన భూముల్లో చోటుచేసుకొన్న అక్రమాలపై రెవిన్యూ డివిజన్ అధికారి దగ్గర నుంచి గ్రామ రెవిన్యూ అధికారి వరకు అక్రమాలకు పాల్పడిన వారి జాబితాను ఎసిబి రూపొందించింది. వీరిలో కొందరిని రెవిన్యూ క్రీడల సందర్భంగా ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో విచారించడం చర్చనీయాంశమైంది.**



ఎసి సుబ్బారెడ్డి స్టేడియంకు వచ్చిన తహశీల్దార్లను విచారిస్తున్న ఎసిబి అధికారులు.

జిల్లాలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల కోసం సేకరించిన భూముల్లో చోటు చేసుకున్న అక్రమాలపై అవినీతి నిరోధకశాఖ అధికారులు తిరిగి విచారణ ప్రారంభించారు. గతవారం రోజుల నుంచి గూడూరు డివిజన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. మొన్న టివరకు మద్యం సిండికేట్ల కార్యాలయాలపై ఆకస్మిక దాడులు జరిపి పలువురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాత పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన భూములపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు శ్రీకారం చుట్టారు. సెజ్‌లపై ఎసిబి విచారణ ప్రారంభమైన తర్వాత ఇద్దరు డిఎస్పీలు మారారు. ప్రస్తుత డిఎస్పీ సెజ్‌ల అక్రమాల్లో సంబంధం వున్న ప్రతిఒక్కరిని విచారణ చేస్తున్నారు.

రెవెన్యూ డివిజనల్ అధికారి దగ్గర నుంచి గ్రామ రెవెన్యూ అధికారి వరకు అక్రమార్కుల జాబితాను రూపొందిస్తున్నారు. భూముల సేకరణ జరిగిన సమయంలో పనిచేసిన కొందరు తహశీల్దార్లు తర్వాత ఇతర మండలాలకు బదలీ అయ్యారు. విచారణ కోసం వీరందరిని పిలిపిస్తున్నారు. నగరంలోని ఎసి క్రీడా మైదానంలో నిర్వహించిన రెవెన్యూ క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన పలువురు తహశీల్దార్లను ఎసిబి అధికారులు కార్యాలయానికి పిలిపించి విచారించారు. విచారణ మరుగున పడిపోయిందని భావిస్తున్న తరుణంలో తిరిగి విచారణ ప్రారంభం కావడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఎసిబి డిఎస్పీ భాస్కర్‌రావు గతంలో జరిగిన విచారణకు సంబంధించిన నివేదికలను బయటకు తీసి పరిశీలిస్తున్నారు.

జిల్లాలో గూడూరు డివిజన్‌లోనే ఎక్కువగా పరిశ్రమల స్థాపన జరిగింది. చిల్లకూరు మండలంలో అంకులపాటూరు, చింతవరం, నాయుడుపేట మండలంలో మేనకూరు, తడ మండలంలో అపాచి బూట్ల తయారీ కంపెనీలకు భారీస్థాయిలో భూకేటాయింపులు జరిపారు. ఈ డివిజన్ తర్వాత నెల్లూరు డివిజన్ పరిధిలోని ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల్లో భూములు సేకరించారు. ప్రస్తుతం ఎసిబి అధికారులు గూడూరు డివిజన్‌లో జరిగిన భూసేకరణపైన దృష్టిసారించారు. ఇక్కడ విచారణ పూర్తి చేసిన తర్వాత ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల్లో విచారణ జరిపే అవకాశం వుంది. ఒకరి పేరునున్న భూములు మరొకరికి నష్టపరిహారం అందించడం, అసైన్‌మెంటు, చెరువు, పోరంబోకు భూముల్ని అక్రమించిన వారికి పరిహారం అందించడంపై భారీగానే ఫిర్యాదులందాయి.

## ఎసిబికి చేతినిండా పని


ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచాల కోసం డిమాండ్ చేసిన సమయంలో ఫిర్యాదులు చేస్తేనే ఎసిబి అధికారులకు పని ఉండేది. మిగిలిన సమయంలో ఈశాఖ ఉద్యోగులకు పెద్దగా పని వుండదన్న అపోహ వుంది. ప్రస్తుతం నెల్లూరు డివిజన్ ఎసిబి అధికారులు నిత్యం బిజీగా వుండే విధంగా పని దొరికింది. మొన్నటి వరకు మద్యం దుకాణాల సిండికేట్లపై విచారణ జరిపిన అధికారులు వెంటనే సెజ్‌లపై విచారణ జరుపుతున్నారు. కార్యాలయంలో వున్న సిబ్బందితోపాటు ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించే వారిని జిల్లాకు రప్పించినట్లు తెలిసింది.

ఉన్న సిబ్బందితోనే బృందాలుగా ఏర్పాటు చేసుకొని విచారణ చేస్తున్నారు. సెజ్‌లపై విచారణ త్వరిత గతిన పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితోపాటు దళారులు విచారణ నుంచి బయటపడేందుకు అధికారపార్టీకి చెందిన నేతల చుట్టూ తిరుగుతున్నారు.

శ్రద్ధేది

# రవాణాలో రంగు మారుతున్న పోలియో వ్యాక్సిన్‌లు!

వైద్య ఆరోగ్యశాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా వ్యాక్సిన్ రంగుమారుతోంది. వారి తప్పిదం కారణంగా లక్షలాది రూపాయలు వ్యయం చేసి కొంటున్నా వ్యాక్సిన్‌లు ఉపయోగపడకుండాపోతున్నాయి. సరైన రీతిలో వ్యాక్సిన్‌లను శీతలీకరణ చేయకపోవడం ఇందుకు కారణం. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి కడప నుంచి పోలియో వ్యాక్సిన్‌లు సరఫరా అవుతుంటాయి. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో జిల్లాకు తీసుకొచ్చి అదే వాహనంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేర్చాల్సి వుంటుంది. అయితే ఈ వ్యాక్సిన్‌లను పర్యవేక్షించే టీకాల అధికారి తన మోహర్బానీ కోసం తన వాహనంలో వాక్సిన్లను చిన్న బాక్స్‌ల్లో వుంచి అందిస్తున్నారు. ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమం జరుగనుంది. ఇప్పటికే ఈ కార్యక్రమంపై వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యాక్సిన్ నిర్వహణపై సూచనలు, సలహాలు చేయడం జరిగింది. వ్యాక్సిన్‌లను అన్ని సదుపాయాలున్న ప్రత్యేక వాహనంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు చేర్చాలని ఆయన ఆదేశించారు. అయినా సదరు అధికారి ఆదేశాలను పాటించకుండా ఆయన కేటాయించిన వాహనంలోనే తీసుకెళుతున్నారు. ఈ వ్యాక్సిన్లను భద్రపరిచేందుకు ప్రతి పిహెచ్‌సిలో 3లక్షలు విలువ చేసే ఐ.ఎల్.ఆర్ (ఫ్రిజ్) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా కార్యాలయం నుంచి గ్రామాలకు తీసుకెళ్లే సమయంలోనే వ్యాక్సిన్ రంగుమారిపోతుంది. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వేసే వ్యాక్సిన్ స్వచ్ఛమైన నీటిలాగానే వుండాలి. అధికారులు తీసుకెళ్లే వ్యాక్సిన్ కొంతమేర ఎరుపు రంగులోకి మారుతున్నట్లు తెలిసింది. ఇలా రంగు మారిన వ్యాక్సిన్ వేస్తే పిల్లలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం వుంటుంది. ఈ విషయం వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే కొంతమంది సిబ్బందికి తెలియదు. పల్స్‌పోలియో నిర్వహించిన రోజు వ్యాక్సిన్‌ను ఎవరూ సక్రమంగా పరిశీలన చేయరు. ముందుగా పరిశీలన చేస్తేనే రంగుమారిన విషయం తెలిసే అవకాశం వుంటుంది. వ్యాక్సిన్ రంగుమారిన విషయాన్ని పిహెచ్‌సిలో సిబ్బంది గుర్తించి టీకాల విభాగం అధికారి దృష్టికి తీసుకెళ్లితే జరిగిన పొరపాటును సరిదిద్దకపోగా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారినే బాధ్యులుగా చేస్తుంటాడని వాపోతున్నారు. గత సంవత్సరం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో రంగుమారిన వ్యాక్సిన్ వేయడం వలన కొన్ని మండలాల్లో పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. పై అధికారి చేసే తప్పిదం కారణంగా క్రిందిస్థాయి వైద్యులు, సిబ్బంది నిందలు మోయాల్సి వస్తుంది. వ్యాక్సిన్ రంగుమారిన విషయాన్ని అధికారికి చెబితే ఆయన నుంచి తిట్లు తినాల్సి రావడంతో ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోలేకపోతున్నారు. రంగుమారిన వ్యాక్సిన్ పిల్లలకు వేయాల్సి వున్నందున ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని నిత్యం ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలని కోట్ల రూపాయలు వ్యయం చేసి ఈ వ్యాక్సిన్ కొనుగోలు చేసి సరఫరా చేస్తుంటే అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వ్యాక్సిన్ సరఫరాపై దృష్టిసారించాల్సిన అవసరముంది.






✍ అల్లూరు రహీం

సూపర్ గుడ్ ఫిలిమ్స్ పతాకంపై సూపర్ స్టార్ కృష్ణ అల్లుడు సుధీర్‌బాబును హీరోగా పెట్టి తీసిన ఎస్‌ఎంఎస్ చిత్రం పేరుకు తగ్గట్టులేదు. ఎస్‌ఎంఎస్ అంటే సెల్‌ఫోన్ భాషలో సంక్షిప్త సందేశమని అర్థం. కానీ దర్శకుడు ఎస్‌ఎంఎస్ అంటే శివ మనసులో శృతిగా ట్యాగ్‌లైన్‌లో పేర్కొన్నాడు. రెండు హృదయాల మధ్య ప్రేమ పుట్టే సమయంలో కాసింత గందరగోళం సహజం. కానీ ఈ సినిమా మొత్తం గందరగోళంగా తీశాడు దర్శకుడు తాతినేని శివ. ఆయనకు ఇదే తొలి సినిమా. స్క్రీన్‌ప్లే కూడా అతనే వ్రాసుకొన్నాడు. ప్రథమార్థం వరకు గందరగోళంగా ఉన్నా కామెడీతో ఎలాగోలా లాగేశాడు. కానీ ద్వితీయార్థమే ప్రేక్షకులు భరించనలవి కాకుండా ఉంది. సినిమాలో పాటలు, ఫైట్లు మీద పెట్టిన శ్రద్ధ, స్క్రీన్‌ప్లేతోపాటు చిత్రాన్ని సంక్షిప్తం చేసేదానిపై దర్శకుడు పెడితే బాగుండేది. కొత్త హీరో సుధీర్‌బాబు పాటల్లో కష్టపడి నర్తించాడు. ఫైట్స్ అదరగొట్టేశాడు. పీల గొంతు మినహా బాగానే నటించాడు. కొత్త హీరోయిన్ రెజీనా కూడా సలక్షణంగా ఉంది. ఈ సినిమాలో కొన్ని వక్ర సన్నివేశాలున్నాయి. రాత్రిపూట మిరపకాయలు ఎండబెట్టడమేమిటి? పున్నమిరోజు అమ్మఒడిలో పడుకొని చందమామను ఏ కోరికలడిగినా తీరిపోతాయట. హీరోయిన్ హీరో కోసం బ్రాందీషాపుకు వెళ్లడం, పోరా పీక్కో దొంగనాకొడకా వంటి డైలాగులు పలకడం దారుణం. చిత్రంలో ఒక సీన్ తర్వాత మరో సీన్‌లో హీరో ధూమపానం చేయడమో, మందు కొట్టడమో చేస్తుంటాడు. కానీ తెరపై ఈ పనులు తప్పని స్ట్రోలింగ్ రాదు. సెల్వగణేషన్ సంగీత సారథ్యంలోని మిడ్‌నైట్ మా స్వంతం, ఇది నిజమే పాటలు బాగున్నాయి. ఓసీ కత్తి పిల్లా చరణంతో సాగేపాటలో అసెంబ్లీలో నిత్యం జరిగే గొడవలను బ్యాక్‌డ్రాప్‌లో గ్రాఫిక్స్‌లో వాడుకోవడం బాగుంది. నంద్యాల రవి వ్రాసిన మాటల్లో ఫ్రెండ్ కాదు ఫ్రాడు, ముందుత్వము బంధుత్వము ప్రాసలతోపాటు ఒక్కసారి ప్రేమలో పడితే దూలతీరిపోతుంది. ఫస్ట్ లవ్ గుర్తుకు రాదు ఆలోచింపజేస్తాయి.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రైలులో బయలుదేరే శివ (సుధీర్‌బాబు), శృతి(రెజీనా)ల మధ్య మాట కలుస్తుంది. తాను సైన్యంలో పనిచేస్తున్నానంటాడు శివ. తాను ఎయిర్ హోస్టస్‌నంటుంది శృతి. వాస్తవానికి శివ కొరియర్ బాయ్. శృతి రేడియో మిర్చిలో ఆర్.జె. తొలిచూపులోనే శివ మనసులో శృతి, ఆమె మనసులో శివకు స్థానం దొరికిపోతుంది. శివ తల్లి శాంత(రోహిణి), శృతి తండ్రి కోదండపాణి(కాశీ విశ్వనాధ్) విచిత్ర మనస్కులు. శృతి సోదరుడు వెన్నెల కిషోర్ ఓ ముస్లిం యువతిని పెండ్లాడిన సమయంలో శివ అతనికి సహకరిస్తాడు. శివ, శృతిలకు ఒకరి గూర్చి మరొకరికి వాస్తవాలు తెలుస్తాయి. దీంతో కొన్నాళ్లు కలహించుకొంటారు. కానీ మనసుల్లోని ప్రేమ మాత్రం మాయదు. ఇగోల మూలంగా ఇద్దరి మధ్య కలతలు పెరిగిపోతాయి. ఛా... ఛీ... అనుకొని రెండేళ్లు దూరమైపోతారు. రిజిస్ట్రార్ ఆఫీసుకు వారిద్దరూ వేరు వేరు వ్యక్తులను పెళ్లి చేసుకోను వెళ్లినపుడు తిరిగి తారసపడతారు. అక్కడా నిందాపర్వం మొదలయ్యి అభిమానపర్వంగా మారుతుంది. ఇద్దరు ఒకటవ్వడంతో చిత్రం ముగుస్తుంది.

పరిశ్రమలో ఒకప్పుడు తాతినేని ప్రకాశరావు గొప్ప దర్శకుడు. ఆ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తే తాతినేని శివ. ఈ చిత్రకథను కన్‌ప్యూజన్‌గా మలచుకొని దాన్ని జనరంజకంగా చెప్పడంలో విఫలమయ్యారాయన. హీరో సుధీర్‌బాబు రెండు పాటల్లో చేసిన నృత్యం ఇప్ప టివరకు పరిశ్రమలో ఏ హీరో చేయనిదే. హీరోయిన్ రెజీనా పాత హీరోయిన్ కీర్తిరెడ్డిని పోలి ఉండినా మంచి నటన ప్రదర్శించింది. ఈ సినిమాలో ఇంకాస్త మసాలాపెట్టి రెండు గంటలకు కుదించి ఉంటే ఫలితం మరో రకంగా ఉండేది.

## క్లాస్... మాస్ తేడాలేదు



హీరో రామ్‌చరణ్ తేజ గతంలో అమితాబ్ బచ్చన్ నటించి విజయ వంతమైన 'జంజీర్' చిత్రం రీమేక్‌లో నటించను గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. ప్రస్తు తం ఆయన రచ్చ, ఎవడు చిత్రాల్లో నటిస్తున్నాడు. రచ్చ షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడుతూ క్లాస్, మాస్... అనే తేడా లేవీ నాకు లేవు. నేనె లాంటి పాత్రలైనా చేయగలను. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల్లో ఉండే వాళ్ల వరకూ అందర్నీ మెప్పించాలన్నదే నా సిద్ధాంతం. నేటి తరానికి దగ్గ రగా ఉండేలా ఉన్న కథల్లోనే నటించను ఒప్పుకొంటున్నాను. నాన్న, బాబాయ్ పవన్‌కళ్యాణ్ కలసి నటించడమనేది ఒక కల. ఆ రోజు కోసం నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానన్నాడు రామ్‌చరణ్ తేజ.

## ఐటమ్ పాటలు చేయను



తెలుగుతోపాటు తమిళ, బెంగాలీ చిత్రాల్లో హీరోయిన్ రిచా గంగోపా ధ్యాయ నటిస్తుంది. రిచా త్వరలో రౌడీ రాథోడ్ చిత్రంలో ఐటమ్ సాంగ్ చేయబోతున్నట్లు వార్తలొచ్చాయి. ఇది తెలుగు 'విక్రమార్కుడు' చిత్రానికి రీమేక్. ప్రభుదేవా దర్శకుడు. సంజయ్ లీలా భన్సాలీ నిర్మాత. అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్నారు. తెలుగులో మేఘనానాయుడు చేసిన పాటను రిచాకు ఆఫర్ చేశారని బాలీవుడ్‌లో చెప్పుకొన్నారు. అయితే ఈ వార్తను ఆమె ఖండించింది. కథలో ప్రాధాన్యం ఉన్న ఏ పాత్రైనా చేస్తాను. ఐటమ్ సాంగ్స్ చేయను. విక్రమార్కుడు కథతోనే బెంగాలీలో నిర్మించే చిత్రంలో తాను నాయికగా చేస్తున్నట్లు రిచా వివరించింది.

## నా పనై పోలేదు!



అనుకుంటాంగానీ ఏ పనీ కష్టమైంది కాదు. చేసే పనిని ఆస్వాదిం చడం మొదలుపెడితే పనిలేని రోజు ఊహించడం కష్టంగా ఉంటుందం టుంది హీరోయిన్ శ్రియ. తెలుగులో ఓ చిత్రంలో నటిస్తున్న శ్రియ హిం దీలో నటించిన 'గలీ గలీ చోర్‌హై' చిత్రం విడుదలకు సిద్ధమవుతుంది. తన కెరీర్ గూర్చి శ్రియ వివరిస్తూ బాలీవుడ్‌లో నా పనైపోయింది అను కొన్న వాళ్లున్నారు. దక్షిణాదిన కూడా సినిమాలు రావనే ప్రచారం చేశారు. ఆ మాటలన్నీ క్రమంగా తేలిపోతున్నాయి. బాలీవుడ్‌లో నేను ఊహించిన దానికంటే ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి. 'గలీ గలీ చోర్‌హై'తో నా కెరీర్ మరో దశ తిరుగుతుంది. అక్కడ నాకింకా తలు పులు తెరచుకొనే ఉన్నాయంటుంది. మనమెందుకు కాదందాం.

## వందేళ్లు బ్రతకాలంటే...



నేను ముందు నన్ను ప్రేమించుకొంటాను. తర్వాత ఇతరుల సంగతం టుంది హీరోయిన్ బిపాసబసు. ఈ విషయమై వివరిస్తూ శరీరం ఎంత ఆరోగ్యంగా ఉంటే మనసు అంత ప్రశాంతంగా ఉంటుందని నా నమ్మకం. ఆస్తులు కూడబెడతాం. అనుబంధాల గూర్చి పట్టించుకుంటాం. కెరీర్ గూర్చి శ్రద్ధ తీసుకుంటాం. ఆరోగ్యం గూర్చి మాత్రం అంతగా పట్టించుకోం. తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సింది ఆరోగ్యానికే. మనం అది మరచిపోతున్నాం. మన దేహానికి తగిన వ్యాయామం ఉంటే చాలా బాగుంటుంది. అందుకే కొత్త వ్యాయామ విధానం అధ్యయనం చేసి ఒక సిడి రూపొందిస్తున్నాను. నిత్యం వ్యాయామంతోపాటు పోషకాహారం తీసుకొని మనసు ప్రశాంతంగా ఉంచుకొంటే వందేళ్లు బతికేయొచ్చంటుంది ఈ ముద్దుగుమ్మ.

## విద్యాబాలన్ మంచి నటి



ఓ హీరోయిన్‌ను మరో హీరోయిన్ మెచ్చుకోవడం గొప్పే. ప్రియాంక చోప్రా మాత్రం తనతోటి నటి విద్యాబాలన్‌ను ప్రశంసలతో ముంచెత్తు తోంది. ఇటీవల ప్రకటించిన ఫిల్మ్‌ఫేర్, జీటీవి ఉత్తమనటి పురస్కారాల కోసం ప్రియాంక, విద్యాబాలన్‌లు తుదివరకు రేసులో నిలిచారు. చివరకు ఈ అవార్డులు విద్యాబాలన్‌కే దక్కాయి. ఈ విషయమై ప్రియాంక మాట్లాడుతూ 'దర్టీ పిక్చర్'లో విద్యాబాలన్ బాగా నటించింది. ఈ పాత్రకోసం ఆమె 14 కేజీల బరువు పెరిగింది. సాధారణంగా హీరోయిన్లు బరువు పెరగరు. ఆ చిత్రంలోని సిల్క్ పాత్ర పోషించమని అడిగి ఉంటే నేను 'నో' చెప్పేదాన్ని. కారణం నేను ఎంత తిన్నా బరువు పెరగను. బరువు పెరగడమే కాదు దర్టీ పిక్చర్‌లో విద్యాబాలన్ బాగా నటించిందని కితాబిచ్చింది ప్రియాంక.

# కోవూరులో పోటాపోటీ ప్రచారం

**తిప్పలు పడుతున్న అభ్యర్థులు**

జిల్లాలోని కోవూరు అసెంబ్లీ నియోజకవర్గంలో త్వరలో ఉప ఎన్నిక జరుగనుండడంతో ప్రధాన రాజకీయ పక్షాల నేతలు పోటా పోటీగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం పార్టీ తరపున ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పర్యటిస్తూ కార్యకర్తలతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ భన్వర్ లాల్ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో కోవూరు ఉప ఎన్నికను మే నెలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషనర్ ప్రకటన చేసిన దగ్గర్నుంచి పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. ఇప్పటికే ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి, ఇందుకూరుపేట మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించడం పూర్తి చేశారు. గ్రామ పంచాయితీల వారీగా సభలు, సమావేశాల ఏర్పాటుకోసం కసరత్తు చేస్తున్నారు. ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడే నాటికి ఎన్నికల ప్రచారం పూర్తి చేయాలన్న అభిప్రాయంతో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు 16 లక్షల రూపాయలకు మించకుండా ఖర్చు చేయాలన్న నిబంధన విధించింది ఎన్నికల సంఘం. అయితే ఉప ఎన్నికల్లో ఒక్కొక్కరు ఐదు నుంచి ఏడు కోట్ల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కోవూరు ఉప ఎన్నికను ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని తమ అభ్యర్థిని గెలిపించుకోవాలన్న పట్టుదలతో ఉన్నాయి. గత ఎన్నికల్లో టిడిపి తరపున గెలిచిన ప్రసన్న ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేయనున్నారు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకంటే ఎన్నికల ప్రచారంలో ముందున్నారు. ఉప ఎన్నిక దృష్ట్యా 18 సంవత్సరాలు నిండిన వారిని ఈ నెలాఖరులోగా ఓటరుగా నమోదు చేసేందుకు గడువు విధించడంతో ద్వితీయస్థాయి నేతలు ఈ పనిలో నిమగ్నమై ఉన్నారు.

# ఆన్‌లైన్ తిప్పలు...

**త్రిశంకు స్వర్గంలో 13వేల దరఖాస్తులు**

ఉపకార వేతనాల మంజూరుకు సమర్పించే ఆన్‌లైన్ దరఖాస్తులో పలు కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ విషయాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పితాని సత్యనారాయణ స్వయంగా అంగీకరించారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం దాదాపు ఐదువేల కోట్ల రూపాయలు ఉపకార వేతనాల కోసం ఖర్చు చేస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పూర్తిచేసి పంపడంలో తీవ్ర జాప్యం జరుగుతుంటుంది. ఇప్పటికీ నెల్లూరు జిల్లాలో దాదాపు 13వేల దరఖాస్తులు ప్రభుత్వానికి అందకుండా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం ఇందుకు కారణం. అన్ని కళాశాలల నుంచి దరఖాస్తులు అందిన తర్వాతనే నిధులు విడుదల చేయడం జరుగుతుందని మంత్రి చెప్పారు. కావాలనే కొన్ని విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు ఉపకార వేతనాలపై విద్యార్థులను రెచ్చగొట్టి ఆందోళన, ధర్నా కార్యక్రమాలు చేస్తున్నాయంటూ పరోక్షంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని విమర్శించారు.

### ఉత్సాహంగా ఉదయలక్ష్మి ప్రసంగం

సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ ఉదయలక్ష్మి గతంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. జిల్లాలో పనిచేసిన సమయంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నా మౌనంగానే ఉండేవారు. ఐఎఎస్ వచ్చిన తర్వాత ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆమె ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ శాఖ మంత్రితో కలిసి నెల్లూరు పర్యటనకు వచ్చిన ఆమె ఉపకార వేతనాల మంజూరుకు సంబంధించిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అడిగిన ప్రశ్నలకు చాలా ఓపిగ్గా సమాధానాలు చెప్పి ప్రశంసలు అందుకున్నారు. మంత్రికంటే ఎక్కువ సమయం ఆమె తీసుకున్నారు. స్కాలర్ షిప్పులకు సంబంధించి విధి విధానాలు, నిబంధనలు, నిధుల విడుదల గురించి క్లుప్తంగా వివరించారు.

● విఆర్వో, విఆర్ఏ

# పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి!

**నగరంలో 55 కేంద్రాల ఏర్పాటు**

జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ రెవిన్యూ సహాయకుల పోస్టుల భర్తీకి ఈ నెల 19వ తేది పరీక్షలు నిర్వహిస్తారు. ఇందు కోసం రెవిన్యూ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. విఆర్వో పోస్టులకు 17600, విఆర్ఏ పోస్టులకు 6750 మంది దరఖాస్తులు చేసుకొన్నారు. జిల్లావ్యాప్తంగా విఆర్వో 26, విఆర్ఏ పోస్టులు 56 ఖాళీగా ఉన్నాయి. వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతోపాటు ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు దళారులు రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. అధికారులు మాత్రం దళారుల మాటలు నమ్మవద్దని కోరుతున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేస్తామని చెబుతున్నారు. ఈ నెల 19వ తేది నగరంలోని 55 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. విఆర్వో పోస్టులకు ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు, విఆర్ఏ పోస్టులకు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

● మినరల్ వాటర్

# ప్లాంట్లపై జెసి కన్నెర్ర!



జెసికి కోపమొచ్చింది.

జిల్లాలోని మినరల్ వాటర్ ప్లాంట్లపై జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ సీరియస్ అయ్యారు. ప్రజలకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన తాగునీటిని సరఫరా చేయకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. ఇప్పటికే పలు వాటర్ ప్లాంట్లపై జిల్లా అధికారులకు ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో జాయింట్ కలెక్టర్ తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి వాటర్ ప్లాంట్ల పనితీరు గురించి చర్చించారు. నాణ్యమైన తాగునీటిని అందించాలని కోరారు. సంబంధిత శాఖ అధికారులు వారి పరిధిలో ఏర్పాటుచేయబడిన ప్లాంట్లను నిత్యం తనిఖీలు చేసి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార కల్తీ నిరోధక చట్టం ప్రకారం సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను అనుసరించి చర్యలు తీసుకోవాలని గుర్తు చేశారు. మరి మన అధికారులు వాటర్ ప్లాంట్లపై ఏమాత్రం చర్యలు తీసుకుంటారో కొద్ది రోజులు వేచి చూడాలి.



హైదరాబాద్‌లోని కళా సుబ్బారావు కళావేదికలో నాసికతో వేణువు వాయించిన నెల్లూరీయుడు చిరమన సాయి హేమంత్ కృష్ణకు నాసికా వేణుగాన రత్న బిరుదును ప్రదానం చేస్తున్న జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి.

# చక్కని వైద్యంచేసే కేరళ ఆయుర్వేద వైద్యశాల

ఆయుర్వేద వైద్య విధానంలో కేరళ ఆయుర్వేదానికి విశేష ప్రాధాన్యముంది. ఎన్నో రకాల వ్యాధులను నయంచేసే చికిత్సా విధానం ఈ వైద్యంలో అందుబాటులో ఉంది. అలాంటి వైద్యాన్ని నెల్లూరీయులకు అందిస్తోంది పొగతోటలో గల కేరళ ఆయుర్వేద వైద్యశాల. ఈ హాస్పిటల్‌ను నగరంలో స్థిరపడిన "మళయాళీస్ అసోసియేషన్" ఆరేళ్ల క్రిందట ఏర్పాటు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఆయుర్వేద వైద్యంలో పేరుగాంచిన కేరళ ఆయుర్వేదంలో ఎండి చేసి అత్యంత అనుభవం గడించిన డాక్టర్ ఎన్.శ్రీవత్సవకుమార్ ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి కేరళ వెళ్లి వైద్యం చేయించుకోనే వారి అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారన్నారు. తక్కువ



డాక్టర్ ఎన్.శ్రీవత్సవకుమార్

ఖర్చుతో వైద్యాన్ని అందించాలన్న సేవాభావంతో ఏర్పాటైన కేరళ ఆయుర్వేద వైద్యశాలలో అన్నిరకాల వ్యాధులకు ప్రత్యేక చికిత్స అందిస్తామన్నారు. కీళ్లనొప్పులు, నరాల వ్యాధులు, పక్షవాతం, కండరాల నొప్పులు, సోరియాసిస్ లాంటి చర్మ వ్యాధులకు, గ్యాస్ట్రిక్ సమస్యలకు, శ్వాసకోశ వ్యాధులకు, స్పాండిలైటిస్, డయాబెటిస్, కిడ్నీలో రాళ్లు తదితర సమస్యలకు చక్కని చికిత్స అందించడం జరుగుతుందన్నారు. స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు, శిరోజాల సమస్యలకు పలు రకాల చికిత్సలతో నయం చేస్తామన్నారు. ఆయుర్వేద మందులకు పత్యం ఉండాలన్న అపోహ ఉందని అది అన్ని జబ్బులకు అవసరం లేదన్నారు. మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కేరళ నుంచి అనుభవజ్ఞులైన వైద్యులు ప్రతి నెల రెండవ శని, ఆదివారాల్లో ఇక్కడకు వస్తుంటారన్నారు. సదుద్దేశంతో ఏర్పాటైన కేరళ ఆయుర్వేద వైద్యాన్ని అందరూ వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.



లేబూరు వాసి కట్టంరెడ్డి వెంకట శేషారెడ్డి కుమార్తె శృతి, వెంకట శ్రావణ్‌ల వివాహం 3వ తేది నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో జరిగింది.


## విఆర్‌కాలేజి ఆస్తి స్వాహా

మొదటి పేజీ కొరవ

స్థాపనలో నిర్వాహకుల ఆంతర్యం మాత్రం పలు అనుమానాలకు రేకెత్తిస్తున్నది. విఆర్ కాలేజీ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ఈ దరఖాస్తు చేశారు. అయితే విఆర్ కాలేజి ఆస్తులు, విద్యాసంస్థలు ఇప్పటి వరకు విఆర్ కాలేజి అండ్ హైస్కూల్ కమిటీ అనే సొసైటీ పేరుతో వున్నాయి. అది దాదాపు వందేళ్ల క్రితమే రిజిష్టర్ అయ్యింది. ఆ తర్వాత కాలంలో దాన్ని హిందు చారిటబుల్ అండ్ ఎండోమెంట్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టం క్రింద రిజిష్టర్ చేశారు. ఆ రిజిస్ట్రేషన్ నియమాల ప్రకారం విఆర్ కాలేజీ ఆస్తులను ఇతరులకు బదలాయించడం, ఇతర మతాలకు సంబంధించిన కార్యక్రమాలు నడపడం నిషేధం. కానీ ఇప్పటి నిర్వాహకుడైన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, ఈ నియమాలను ఉల్లంఘించి కొత్తగా విఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనే పేరుతో కొత్త సంస్థ ప్రారంభించాడు. దాని ఉద్దేశం సందేహాస్పదంగా వుంది. వైఎంసిఎ మైదానంలోని నాలుగున్నర ఎకరాల భూమి విఆర్ కాలేజి అండ్ హైస్కూల్ కమిటీ పేరుతో రిజిష్టర్ చేసి వుంది. కానీ ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీ కోసం ఏఐసిటిఇకి చేసిన దరఖాస్తులో ఆ ఆస్తి విఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో వున్నట్లు కాగితాలు సమర్పించారు. ఈ కొత్త సొసైటీలో కేవలం ఆనం కుటుంబ సభ్యులు మాత్రమే వున్నారు. అంటే విఆర్ కాలేజీ కోసం పెద్దలు సమకూర్చి పెట్టిన విలువైన ఆస్తిని అక్రమ మార్గంలో తమ కుటుంబ పరం చేసుకోవడానికి లోతైన కుట్ర జరుగుతున్న దన్న మాట. ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం విఆర్ కాలేజి అండ్ హైస్కూల్ కమిటీ పేరుతో రిజిష్టర్ అయిన భూమిని, ఆ కమిటీ ప్రమేయం లేకుండా కొత్త సొసైటీ పేరుతో ఎట్లా బదలీ చేశారన్నది ఈ కుట్రకు మూల భాగం. వైఎంసిఎ మైదానం చర్చి ఆఫ్ సౌత్ ఇండియాకి చెందిన ఆస్తి. బ్రిటీష్ పాలకులు భారతదేశం వదలి వెళ్లేటప్పుడు ఎంజ్లికన్, ప్రొటెస్టెంట్ చర్చిలకు సంబంధించిన ఆస్తులన్నిటికీ ఈ చర్చి ఆఫ్ సౌత్ ఇండియాను నిర్వాహకురాలిగా పెట్టి వెళ్లారు. వారి ప్రతినిధే స్వచ్ఛందంగా ఈ మైదానాన్ని విఆర్‌కాలేజి కమిటీకి విక్రయం చేశాడు. అది జరిగిన ముప్పై ఏళ్ల తర్వాత ఆ పాత కాగితాలను మాయం చేసి, కొత్తగా తమ కుటుంబ సభ్యుల పేరుతో విఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనే పేరుతో మార్పిడి చేయించుకొన్నట్లున్నాడు ఆనం వివేకానందరెడ్డి. జనానికి అనుమానం రాకుండా వుండడానికి ఆ సొసైటీ ముందు విఆర్ అనే పేరు తగిలించాడు. దాదాపు 250 కోట్ల రూపాయల విలువైన ప్రజల ఆస్తిని వుట్రవుడియంగా కొట్టేయడానికి ఎంత ఘోరమైన కుట్ర పన్నుతున్నారో చూడండి.

ఈ కొత్త సొసైటీ పేరుతో కొత్త కాలేజి పెట్టడం జరిగితే, అది ఆనం కుటుంబ స్వంత ఆస్తిగా మారిపోతుంది. వారికి నిజంగా విఆర్ కాలేజి విద్యా సంస్థలను అభివృద్ధి చేయాలనే సత్సంకల్పం వుంటే, నేరుగా ఆ కమిటీ పేరుతోనే ఇంజనీరింగ్ కాలేజీ నెలకొల్పి వుండవచ్చు. అట్లా కాకుండా ఒక కొత్త సొసైటీ సృష్టించారంటే, విఆర్ కాలేజి ఆస్తులను అక్రమంగా తమ పరం చేసుకోవడానికి కుటిల బుద్ధితో వ్యవహరిస్తున్నారని అర్థం.

విఆర్ కాలేజి కమిటీకి వివేకానందరెడ్డి సెక్రటరి అయితే, ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షుడు. ఆయనిప్పుడు ఆర్థికమంత్రి. అంత ఉన్నత స్థానంలో వుండి జేబు దొంగ కంటే హీనంగా ప్రవర్తించడం వినడానికే అసహ్యంగా వుంది. అన్నదమ్ములిద్దరినీ ధన పిశాచి ఏదో ఆవహించినట్లుంది. జనం సొత్తు ఎంత దోచుకొన్నా వారి తనివి తీరడం లేదు. ఇప్పుడు ఏకంగా నెల్లూరు చరిత్రలో ఒక భాగమైన విఆర్ కాలేజి విద్యాసంస్థలకే ఎసరు పెడుతున్నారు. ఈ దుర్మార్గాన్ని నిరసించడం, ప్రతిఘటించడం ప్రతి నెల్లూరు పౌరుడి కర్తవ్యం. విఆర్ కాలేజి పూర్వ విద్యార్థులు కలిసికట్టుగా ప్రయత్నం చేస్తే తప్ప అది సాధ్యం కాదు. నెల్లూరు జిల్లాలో రాజకీయ పార్టీలు, నాయకులందరూ ఆనం సోదరుల చెప్పులు మోసే హీన స్థితిలో వున్నారు. కాంగ్రెస్ వాదులు సరే, వారి మాటకు ఎదురు చెప్పాలనే ఆలోచన కలలో కూడా చేయలేరు. బిజెపి, సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం పార్టీ జిల్లా నేతలందరూ కూడా రియల్ ఎస్టేట్ అవసరాల కోసమో, ఇతరత్రా పనులు జరిపించుకోవడం కోసమో ఆనం వారికి గులాములుగా వ్యవహరిస్తున్నారు. వారి తప్పులను నామ మాత్రంగా ప్రశ్నించే ధైర్యం కూడా ఈ పార్టీ నేతలు ఒక్కరికీ లేదు. అందువల్ల రాజకీయ పార్టీలను పక్కనపెట్టి, పూర్వ విద్యార్థులు ఒక ఉద్యమ రూపంలో ముందుకు కదిలితే తప్ప విఆర్ కాలేజీని, దాని ఆస్తులను కాపాడుకోవడం దుర్లభం.



## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

### ఆలస్యంగా జర్నలిస్టుల సంఘం ఎన్నికలు!

ఊరంతటికీ శకునం చెప్పే బల్లి కుడితిలో పడినట్లు అన్ని వ్యవహారాలను బయటపెట్టే విలేకరులకు తమ సంఘం ఎపియూడబ్ల్యుజె కార్యవర్గ ఎన్నికలను ఆలస్యంగా జరుపుతున్నారు. ప్రతి యేడాదికి ఓసారి జరగాల్సిన ఈ ఎన్నికలు రెండేళ్లు పూర్తయ్యి మూడో సంవత్సరంలో ప్రవేశిస్తున్న సమయంలో ఈనెల 19తేది జడ్పీ మీటింగ్‌లో జరుగనున్నాయి. ఎపియూడబ్ల్యుజె సిట్టింగ్ కేంద్రం ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ఎన్నికలు ఎప్పుడు పెడతారో కొత్తగా ఎన్నికయ్యే కార్యవర్గం తేల్చాలిమరి.

### మద్యపాన ప్రియుల సంక్షేమ సంఘం గడబిడ!

మద్యం సిండికేట్లు, ఎక్సైజ్ పోలీసులు, సివిల్ పోలీసులు, వివిధ శాఖల అధికారులు, విలేకర్ల మధ్య లింకులను ఎసిబి బయటపెడుతున్న తరుణంలో మద్యపాన ప్రియుల సంక్షేమ సంఘం ఒకటి ఏర్పడి చేస్తున్న గడబిడ అందర్నీ ఆకర్షిస్తుంది. ఒకప్పటి మంచి జర్నలిస్టు, జనం, నాయకులు కలసి తాగుబోతు చేసిన సిరాజ్ ఈ సంక్షేమ సంఘానికి అధ్యక్షుడు. సిరాజ్‌కు ఆత్మీయులు, అభిమానులు జాస్తి. ఈయన వీరితో కలసి ఎక్సైజ్ కార్యాలయం ముందు మందుబాబులకు తాగను అప్పులిప్పించమని, ఎంఆర్‌పి ధరలకు మద్యం లభించక మందు బాబులు పడుతున్న పాట్లు తప్పించమని ధర్నాలు చేస్తున్నాడు. ఎసిబి కార్యాలయం, ప్రెస్‌క్లబ్‌లో సమావేశాలు పెట్టి చేస్తున్న గందరగోళానికి పరమార్థ మేమిటో ఎవరికి అర్థం కాని సిరాజే చెప్పాలి.

### సెలవులో జెసి

జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ ఈనెల 25వ తేది వరకు సెలవుపెట్టి స్వస్థలం ఢిల్లీ వెళ్లారు. ఆయన తిరిగి వచ్చేవరకు అదనపు జెసి లక్ష్మీకాంతం జెసిగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

### కామాక్షమ్మకు మకరతోరణం

జొన్నవాడ కామాక్షమ్మకు 6.40 లక్షల రూపాయలు విలువచేసే బంగారు మకర తోరణాన్ని హైదరాబాద్‌లో స్థిరపడిన నెల్లూరీయుడు మారం రెడ్డి నందగోపాల్‌రెడ్డి, సుజాతమ్మ చేయించారు. దీన్ని 10వ తేది ఈ దంపతులు అమ్మవారిని దర్శించి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేగూరు రవీంద్ర రెడ్డికి అందించారు.

### క్యాప్‌కు ప్రశంసలు

నెల్లూరు ఎస్పీ రమణకుమార్ ముద్దుబిడ్డ పోలీస్ చైల్డ్ ప్రాజెక్ట్‌కు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. 12వ తేది హైదరాబాద్‌లోని ఎపి జ్యుడిషియల్ అకాడమి ప్రాంగణంలో జరిగిన బాలల హక్కుల పరిరక్షణ సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి కబీర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాధవ్ బి.లోకూర్ సమక్షంలో నెల్లూరు చైల్డ్ ప్రాజెక్ట్ గూర్చి ఎస్పీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీనికి ముగ్ధుడైన సుప్రీంకోర్టు జడ్జి క్యాప్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించేలా చూస్తానన్నారు. ఎస్పీ ఈ ప్రాజెక్ట్ ప్రారంభించిన వేళావిశేషం బోడిగాడి తోటలో గాలికి ధూళికి తిరిగే పిల్లల బతుకుల్లో వెలుగులు ప్రసరించాయి.

### సరస్వతి నిధికి కృష్ణకిషోర్ విరాళం

కలెక్టర్ మానస పుత్రిక సరస్వతి నిధికి రత్నం విద్యాసంస్థల అకడమిక్ డైరక్టర్ డాక్టర్ కె.కృష్ణ కిషోర్ 50వేల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. 11వ తేది డైకస్ రోడ్డులోని రత్నం మాడల్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకటించిన ఈ విరాళాన్ని 13వ తేది విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపల్ సుప్రియ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డిని కలసి అందించారు.

### ట్రైనీ ఐపిఎస్

ట్రైనీ ఐపిఎస్ రాహుల్‌దేవ్ శర్మ శిక్షణ నిమిత్తం నెల్లూరు వచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్ ఈయన స్వస్థలం. 2010లో ఐపిఎస్‌కు ఆంధ్రా క్యాడర్ అధికారిగా ఎంపికయ్యారు. రెండేళ్ల హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందిన అనంతరం ఆరు నెలలపాటు క్షేత్ర స్థాయిలో వివిధ అంశాల పరిశీలనకు నెల్లూరుకు పంపారు. ఎస్పీ రమణకుమార్ నేతృత్వంలో ఈయన మంచి ఎస్పీగా తయారవుతాడని ఆకాంక్షిద్దాం.

### చరిత్ర పరిశోధకుని మరణం

ప్రసిద్ధ చరిత్ర పరిశోధకుడు ప్రొఫెసర్ బొట్ల గూడూరు రాజేంద్రప్రసాద్ ఇటీవల హైదరాబాదులో మరణించారు. ఆయన నెల్లూరీయుడు. విఆర్‌కాలేజిలో చదివాడు. తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చరిత్ర, రాజనీతి శాస్త్రాల విభాగాలకు విశేష సేవలందించాడు. నెల్లూరు జిల్లా చరిత్రకు రాజేంద్ర ప్రసాద్ ఒక ఎన్‌సైక్లోపీడియ వంటి వాడు. చరిత్ర పూర్వం నుంచి ఈనాటి వరకు నెల్లూరు జిల్లాకు సంబంధించిన సమస్త సమాచారం, శాసనాలు, చాటువులు, ఇతరత్రా చారిత్రక ఆధారాలు, వాటి పుట్టు పూర్వోత్తరాలు ఆయనకు కంఠోపాఠంగా వుండేవి. విఆర్ కాలేజి రిటైర్డ్ చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ సివి.రామచంద్ర రావు గారి తర్వాత నెల్లూరు జిల్లా చరిత్ర మీద అంత విస్తృత పరిశోధన చేసినవాడు, ఔపోసన పట్టినవాడు రాజేంద్ర ప్రసాద్ ఒక్కడే అని చెప్పడం అత్యుక్తి కాదు. ఆయన ప్రచురించిన పలు చారిత్రక గ్రంథాలలో నెల్లూరు చరిత్ర ప్రస్తావన వుంది. అయితే అవన్నీ ఆంగ్లంలో వున్నాయి. ఆసక్తి కల్గిన వారెవరైనా పూనుకొని వాటిని తెలుగులో ప్రచురిస్తే జిల్లాకు ఎంతో ఉపకారం జరుగుతుంది.

ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ స్వగ్రామం బుచ్చి రెడ్డిపాళెం. ఆయన తండ్రి బొట్లగూడూరు సూర్యనారాయణ విఆర్ హైస్కూల్ అధ్యాపకుడు.


### వల్లూరు సుందరరాజం మరణం

ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా పనిచేసి రిటైర్డ్ అయిన నెల్లూరీయుడు వల్లూరు సుందర రాజం (76) 12తేది మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు వున్నారు.

ఆత్మీయులను కోల్పోయిన పై రెండు కుటుంబాల వారికి మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము.

## పదరంగం -2

నిర్వహణ : బాబాజీ



**అడ్డం**

1. తరగని సంపదలనిచ్చే కుండ (5)
4. ఒక వైష్ణవ సంప్రదాయం (4)
7. ఒక సాధన, ప్రాప్తం (2)
8. తెలివి, నాలెడ్జి (2)
9. ఇష్టంలేని ప్రసంగం (2)
10. అనారోగ్యానికి హేతువు (5)
11. ఒక జల వనరు (2)
12. ఉరి (5)
14. నిలుపుదల ఉత్తరువు (1)
15. నిలువు 13కు ఆశ్రయ ప్రాంతాలు (4)
16. పేకాట ముక్కలు కావు, నేతనేసే మగ్గంలోని ఒక పరికరం (5)
20. ఎక్కడ? (2)
21. అటు నుంచి – చల్లబడని (3)
22. గణేశుడే (5)
23. వానరం (2)
24. జంతువుల ఎక్‌స్ట్రా అవయవం (2)
25. కాఫీ రుచికి కారణం (3)
26. ఆలస్యం (శూన్యం లోపించింది) (3)
27. మంచి రుచి (3)
28. జంట (3)
29. నాగరాజు శిరోధార్యాలు (5)
30. డిక్టేటర్ (3)

**నిలువు**

1. శకుంతల కథ (8)
2. యోగి (2)
3. ఏకాదశికి 3వరోజు (4)
5. ఫ్యాక్షనిజంపై కె.ఎన్.వై. పతంజలి నవల (4)
6. వరుస తప్పిన వరుస (3)
10. చేతలుడిగినవాడు (4)
13. నెత్తిమీద జీవులు (2)
16. రెండు ఐదులు (2)
17. క్రింద నుంచి మేరి మాత ఉత్సవాలకు ప్రశస్తి (4)
18. ఒక రకం సేమ్యా (2)
19. కత్తి (4)
20. సప్తగుర్తులు (5)
21. ఆధారం (4)
23. వాంఛ (3)
26. భయంకరం (3)

**సమాధానాలు**

## పదరంగం -1

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1శ్రీ | 2కా | రం | | 3క | | | 4స | 5మ | 6వ | ర్తి |
| | ల | | 7భ | ళా | | | | 8న | ల | వ |
| | 9క్రూ | 10త | | శా | | 11అ | డ | వి | | 12నో |
| | 13టం | క | శా | ల | | | 14ఓ | | 15నీ | 16మ |
| 17హ | | రా | | | 18క | ళ | | | | |
| ల | | 19రు | జు | వు | | 20ఊ | | 21అ | | 22ఆ |
| 23ధా | త్రి | | రు | | | | 24అ | నా | ర్క | లి |
| రి | | | 25బు | | 26త | | 27వ | స | | |
| | | 28క్లూ | | | 29ర | 30జ | ని | | 31ఊ | 32క |
| 33ఊ | | | 34ఉ | ప్పు | గ | ల్లు | | 35బూ | | ల |
| 36దా | దా | గి | రి | | తి | | 37వ | ర | వ | శం |

# సంక్షిప్త సింహపురి

## ఓదార్పుతోపాటు వెయ్యి!

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఓదార్పుకు వచ్చారంటే ఆ కుటుంబానికి ఎంతోకొంత ఆర్థిక సహాయం అందుతుంద నేది అందరికీ తెలిసిన విషయమే. 10వ తేదీ నెల్లూరు వచ్చిన జగన్మోహన్ రెడ్డి మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో రెడీ అయ్యి పెళ్లికి వెళ్తుండగా ఓ ముసలావిడ కాన్వాయ్ ముందుకు వచ్చి నా ఓటు నీకే అని అరచింది. అంతే కాన్వాయ్ ఆగింది. జగన్ కారు దిగి ఆవిడను దగ్గరకు తీసుకొని ఓదా ర్చారు. తళతళలాడే వెయ్యి రూపాయలనోటు ఆమె చేతిలో పెట్టగానే ముసలావిడ ముఖంలో వెయ్యి వోల్టుల విద్యుత్ వెలుగులు ప్రసరించాయి.

## నల్ల గుడ్డు మార్పిడి




నెల్లూరు నగరం లోని కంటి వైద్యశాలల్లో మాదరన్ ఐ హాస్పిటల్ పేరెన్నికగన్నది. అత్యాధు నికమైన కంటి వైద్యం ఇక్కడ చేస్తున్నారు. ఈ వారంలో నల్లగుడ్డు మార్పిడి ఆపరేషన్ ఈ హాస్పిటల్‌లో విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణంగా కంటికి చిన్న చిన్న గాయాలు తగలడం వల్ల, కొన్ని రకాల దుమ్ము, ధూళి పడడం వల్ల కళ్లలో పుండ్లు పడతాయట. దీనివల్ల కంటిలో నల్లగుడ్డు(కార్నియా) దెబ్బ తింటుంది. దాత నుంచి స్వీకరించిన కంటి గుడ్డును అమర్చడంతో ఈ సమస్య పరిష్కారమవుతుంది. చేజర్ల మండలం మాముడూరుకు చెందిన బి.మీరయ్య నల్లగుడ్డు దెబ్బతిని బాధపడుతుండగా ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా ఈ ఆపరేషన్ చేసినట్లు మాదరన్ ఐ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పి.ఎల్.రావు, డాక్టర్ హెచ్.భారతి విలేకరులకు చెప్పారు. ఈ సమా వేశంలో సర్జన్ డాక్టర్ ఇ.ఎల్.ఎస్.జ్యోతి కూడా పాల్గొన్నారు.

## పెళ్లిలో దొంగల చేతివాటం

పెళ్లి, పబ్లిక్ మీటింగు అనే తేడా లేదు చోరాగ్రేసరులకు. కనుపర్తి పాడు క్రాస్‌రోడ్డులో జడ్పీ మాజీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పెళ్లికి కృష్ణాజిల్లా ఏ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన గుంటక రామిరెడ్డి వచ్చారు. 9.15 ప్రాంతంలో పెళ్లి మండపానికి వైఎస్ జగన్ రావడం జనం రద్దీగా త్రోసుకోవడం జరిగింది. సందట్లో సడేమియాగా దొంగలు రామిరెడ్డి వెనుక జేబులోని పర్సులాగేశారు. దీనిలో వెయ్యిరూపా యల నోట్లు పది, అమెరికా డెబిట్ కార్డు, బ్యాంక్ ఆఫ్ అమెరికా చెక్ లున్నాయని బాధితుడు ఐదవనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## విఆర్‌సి విద్యార్థి ఘనత



స్వామి వివేకానంద 150వ జయంతిని పురస్క రించుకొని ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యాశాఖ ఆధ్వ ర్యంలో రాష్ట్రస్థాయి సాహిత్య సాంస్కృతిక యువజన ఉత్సవాలు జరి గాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి వక్తృత్వపోటీలో విఆర్‌కళాశాలలో బిఏ ప్రథమ సంవత్సరం చదివే యువతి ప్రణతి ప్రథమస్థానంలో నిలి చింది. ప్రణతిని కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మస్తానమ్మ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

## చైనీస్ హీలింగ్‌తో బిపి, షుగర్ అదుపు




చైనీస్ హీలింగ్ పద్ధ తిలో బిపి, షుగర్ వ్యాధు లను నియంత్రించవచ్చు టున్నారు నెల్లూరీయుడు, ప్రస్తుతం చెన్నైలో స్థిరపడ్డ జైచీ క్విగాంగ్ మాస్టర్ రంగారావు. ఈ పద్ధతు లను నగరంలో నిర్వహిం చిన ఓ సమావేశంలో వివరించారాయన. రంగారావును రొటేరియన్ నిడిగంటి గోవర్ధనరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి శేఖర్, రొటేరియన్ నరసారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘ వేంద్రశెట్టి సన్మానించారు.

## కోవూరు బిసిలకివ్వండి!

బిసిల పట్ల ముసలి కన్నీరు కార్చే రాజకీయపార్టీల్లో చిత్తశుద్ధి వుంటే రానున్న ఉప ఎన్నికల్లో కోవూరు అసెంబ్లీ స్థానాన్ని బిసిలకు కేటాయించా లని బిసిల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ బిరుదరాజు బాలాజీరాజు ప్రెస్‌క్లబ్‌లో డిమాండ్ చేశారు. 10వ తేది విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 54శాతం బిసిలున్నప్పటికీ రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ రం గాల్లో అణిచివేతకు గురవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో మల్లి వెంకటే శ్వర్లు, జువ్వలయాదవ్, ఎల్లసిరి నీరజమ్మ, గుంజి శ్రీనివాసులు, నారాయణ యాదవ్, అంకయ్య, అంకబాబు పాల్గొన్నారు.



## రైతు లోకం

# వరినాసించే కీటకాలు - నివారణ చర్యలు!

జిల్లాలో వరినాట్లు పూర్తి చేసిన రైతులు ఆ తర్వాత వరికి సోకే వివిధ రకాల తెగుళ్ల నుంచి రక్షించుకొనేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనికిగాను వ్యవ సాయ శాఖాధికారుల సూచనలు, సలహాల మేరకు ఎరువులు, పురుగుమందులు వినియో గించాల్సి వుంటుంది. కాని రైతులు అధికారుల వద్దకు వెళ్లకుండా ఎరువుల దుకాణదారులను సంప్రదించి వారు ఏవి చెబితే వాటిని వాడుతు న్నారు. ఇలా చేయడం కారణంగా రైతులు తెగుళ్లను నియంత్రించలేకపోవడమే కాకుండా ఆర్థికంగా కూడా బాగా నష్టపోతున్నారు. దీనిని నివారించాలంటే వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు తీసుకొని సాగు చేయా లని కోరుతున్నారు శాస్త్రవేత్తలు. ప్రస్తుతం వరి నాట్లు ఎక్కువ విస్తీర్ణంలో వేసి వున్నారు. కాని వరికి వివిధ దశలలో పలు రకాల తెగుళ్ల వ్యాపించి నాశనం చేస్తున్నాయి. నారుమడి నుండి ఈనిక దశ వరకు కాండం తొలిచే పురుగు ఆశిస్తుంది. పిలక దశలో – మొవ్వు చని పోతుంది. ఈనిక దశలో తెల్లకంకులు వస్తాయి. నారుమడి దశలో తల్లిపురుగు లేదా గ్రుడ్ల సముదాయం పై విధంగానే పంటను నాశనం చేస్తుంది.

### నివారణ కోసం పాటించాల్సిన పద్ధతులు:

క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేక ఫాస్ఫా మిడాన్ 40 శాతం 2 మిల్లీలీటర్లు లేక ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరాకు 8 కిలోలు లేదా కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకు మడత, నాము, తెల్ల తెగులు: గొం గళి పురుగు ఆకు మడతలో వుండి పత్రహరి తాన్ని గోకి తినివేయడం వల్ల ఆకులు తెల్లబడ తాయి. పోటాకు దశలో నష్టం ఎక్కువగా వుం టుంది.

**డాక్టర్ పి.రమేష్‌బాబు,**
శాస్త్రవేత్త, కృషివిజ్ఞాన కేంద్రం, నెల్లూరు.

### నివారణ పద్ధతులు:

పిలక దశలో తాడుతో చేనుకు అడ్డంగా 2–3సార్లు లాగితే పురుగులు కిందపడిపోతాయి. క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేక ఎసిఫేట్ 1.5గ్రాములు లేక కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేక కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎక రాకు ఎనిమిది కిలోలు వాడితే పురుగులు నశించి, అధిక దిగుబడులు వస్తాయి.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

# కాకాణి కళ్యాణం కమనీయం!

అలకాపురి ఎట్లా వుంటుందో కథలో వినడమే. కానీ దాని స్వరూపాన్ని కళ్లకు కట్టాడు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి. తన కుమార్తె పెళ్లి వేడుక జరపడానికి ఒక త్రిశంకు స్వర్గాన్నే సృష్టించాడు. నెల్లూరు జిల్లాలో కోటీశ్వరులకు కొదవ లేదు. కోకొల్లలుగా వున్నారు. వారి వివాహ వేడుకలలో పెట్టే ఖర్చు, చేసే ఆర్భాటం, చూపించే ధనదర్పం అంతా ఇంతా కాదు. ద్రవ్యాన్ని ద్రవం వలె పారిస్తూ వుంటారు. వారి సంపద స్థాయికి సూచికలు ఫైవ్‌స్టార్ హోటళ్లు, ఖరీదైన స్కాచ్ విస్కీ సీసాలు, కళ్లు జిగేల్ మనే వజ్రాభరణాలు, ఒకరిని మించి ఒకరుగా పోటీలుపడి కొన్న విదేశీ కార్లు మాత్రమే. ఆ వేడుకలలో అతిథుల



కంటే కార్ల సంఖ్య అధికంగా వుంటుంది. కానీ కాకాణి గోవర్ధన్‌రెడ్డి వేడుక ఇందుకు పూర్తి భిన్నం.




పెళ్లి మండపం నిండా ఇసకేస్తే రాలని రీతిలో జనం. సీతారాముల కళ్యాణానికి అయోధ్య నగరమంతా తరలి వచ్చిందన్న వర్ణన గుర్తుకొచ్చింది. రాజకీయ సభలకు వచ్చినట్లే వుండింది జనం తీరు. మందల మందలుగా, ఎక్కడో కిలో మీటర్ దూరంలోని జాతీయ రహదారి మీద నుంచి ఓపికగా నడిచి వచ్చారు జనం.

మనం పుట్టక ముందు, ఇందుకూరుపేటలో జరిగిన అన్నూరు సుబ్బానాయుడు కుమార్తె వివాహ వేడుక చరిత్రలో ప్రశస్తమైన ఘటన. నెల్లూరు నుంచి ఇందుకూరుపేట వరకు చలువ పందిరి వేసి, కంచి నుంచి ఆరు నెలల ముందుగా పట్టు చీరలు నేసే మగ్గాలు తెప్పించి, ఆ రోజులలో వున్న ఏకైక మెయిల్ రైలులో విశాఖ నుంచి నెల్లూరు వరకు ఎవరు బండెక్కినా ఉచిత ప్రయాణ వసతి కల్పించి, మహా ఆర్భాటంతో జరిపిన పెండ్లి అది. ఆ తర్వాత అంతటి ఆర్భాటం మాగుంట సుబ్బరామరెడ్డి గారి కుమారుడి కళ్యాణ మహోత్సవంలో కన్పించింది. అటు వేల సంఖ్యలో సాధారణ ప్రజలు, ఇటు వందల సంఖ్యలో జయలలిత, శరద్‌పవార్ వంటి అతిరథ మహారథులు ఒక చోట గుమికూడిన అద్భుత సందర్భం అది. తెలుగుదేశం నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమార్తె పెండ్లి రిసెప్షన్ కూడా ప్రత్యేకంగా ప్రస్తావించదగింది. వేలాది మందికి షడ్రసోపేతమైన మాంసాహార విందు వండి వడ్డించడం ద్వారా అందరి మెప్పు పొందాడు చంద్రమోహన్‌రెడ్డి. ఇన్నాళ్ల తర్వాత మరొకసారి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చాడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి.

కళ్యాణ మండపాన్ని అలకాపురి వలె తీర్చిదిద్దాడు. విశాలమైన ఆవరణంలో కళ్లు చెదిరే మండపం నిర్మించాడు. దాన్నొక సినిమా సెట్టింగ్ వలె తీర్చిదిద్దాడు. స్వాగత ద్వారంగా తిరుమల వెంకన్న వజ్ర కిరీట నమూనాను అమర్చాడు. ఆ కిరీటంతో



మండపానికి ఎక్కడలేని శోభ సమకూడింది. అలంకరణల మీద ఎంత శ్రద్ధ చూపాడో అతిథి మర్యాదల విషయంలోనూ అంతే అనురక్తి చూపాడు. దానితో అన్ని వేల మంది జనం ఒకేసారి వచ్చి



పడినా ఎవరికీ ఏ లోటు లేదు. జనాన్ని రప్పించడం కంటే వారిని సరైన మర్యాదలతో మెప్పించడం కష్టమైన పని. అందులో తన కార్యదక్షత సమస్తం ప్రదర్శించాడు గోవర్ధన్‌రెడ్డి.

మొత్తానికి నెల్లూరు జనం చాలాకాలం గుర్తుంచుకొనే పెళ్లి జరిపించాడు కాకాణి. ఆయన కుమార్తె సౌభాగ్యవతి పూజిత అదృష్టవంతురాలు. వరుడు అయ్యప్పరంగారెడ్డి కూడా చూడముచ్చటగా వున్నాడు. వారి వైవాహిక జీవితం నూరేళ్లపాటు సుఖ సంతోషాలతో కొనసాగాలని అభిలషిస్తున్నాము.












Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com